# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
10-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 108

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## మమ్మల్ని కొన్నాళ్లు పని చేయనివ్వండి

### అభివృద్ధి జరగనివ్వండి: సీఎం రేవంత్‌రెడ్డి

### రాజకీయాలకు సమయం కాదు.. ఎన్నికలప్పుడే రాజకీయాలు


### ప్రీమియర్ ఎనర్జీస్ సోలార్ ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్:'మేము చేస్తున్న అభివృద్ధి పనులకు సహకరించకపోయినా పరవాలేదు కానీ.. అడ్డు తగులుతూ కడుపులో ఉన్న విషాన్నంతా రోజూ మాపై కక్కొద్దు.. రాజకీయాలు ఏమైనా ఉంటే ఎన్నికలప్పుడు చూసుకుందాం. ఎవరు ఏం చేశారో? అప్పుడు చర్చిద్దాం. మమ్మల్ని కొంతకాలం పని చేసుకోనివ్వండి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారం కోల్పోయిన బాధ మీకు ఉన్నా అభివృద్ధి జరగనివ్వండని పరోక్షంగా విపక్ష బీఆర్ఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపురంలో ప్రీమియర్ ఎనర్జీస్ ఏర్పాటు చేసిన 5.6 గిగావాట్ల సామర్థ్యంగల సోలార్ మాడ్యూళ్ల తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని రేవంత్ చెప్పారు. తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా

## బలపడిన అణు బంధం

- భారత అణు విద్యుత్ ప్రాజెక్టులకు ఇకపై ఆస్ట్రేలియా యురేనియం
- భారత్, ఆస్ట్రేలియా మధ్య కుదిరిన పౌర అణుశక్తి ఒప్పందం
- ఇరుదేశాల ప్రధానమంత్రులు నరేంద్ర మోదీ, ఆంథోనీ అల్బానీస్ భేటీ
- కీలక రంగాల్లో పరస్పరం సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయం
- ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంపై కార్యాచరణ వేగవంతం
- ఓడల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణలో కలిసికట్టుగా అంగీకారం

2లో



## విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..


- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్
- శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేయాలని సునిక్ సిస్టమ్స్‌కు విజ్ఞప్తి
- ఏపీలో ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కియాకు ప్రతిపాదన
- కొరియా ఉపమంత్రితో భేటీ.. ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటుకు విజ్ఞప్తి



## మౌలిక వసతులపై భీకర దాడులు

- ఇరాన్ రైల్వే వంతెనలను నాశనంచేసిన అమెరికా సేన
- తొలిసారిగా చాబహార్ నౌకాశ్రయంపై మెరుపు దాడి
- మారిటైమ్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ ధ్వంసం
- బుషెహర్‌లోని అణు విద్యుత్ కేంద్రం సమీపంలోనూ పేలుళ్లు
- ప్రతిగా అమెరికా మిత్ర దేశాలపై ఇరాన్ దాడులు



## భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపేశా

మరోసారి ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

2లో

## బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్

- హైకోర్టు కీలక తీర్పు
- బెయిల్‌కు షరతులు విధింపు
- 49 రోజుల జైలు తర్వాత ఊరట
- దర్యాప్తుకు సహకరించాలని ఆదేశం

2లో





## ఇది నా ఆత్మగౌరవం మీద దాడి...

- ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని వెంటాడుతూనే ఉంటా: ఎంఎస్ రాజు
- వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తీవ్రస్థాయిలో ధ్వజం
- ఇది తన ఆత్మగౌరవానికి, ప్రకాశ్ రెడ్డి అహంకారానికి మధ్య జరుగుతున్న యుద్ధమని వ్యాఖ్య
- ప్రకాశ్ రెడ్డి సోదరుడిని కటకటాల వెనక్కి పంపే వరకు పోరాటం ఆగదని హెచ్చరిక
- తనపై చేసిన ఆరోపణలను గురువారం లోపు నిరూపించాలని ప్రకాశ్ రెడ్డికి సవాల్
- తోపుదుర్తి కుటుంబ చరిత్రపై, వారి ఆర్థిక లావాదేవీలపై సంచలన ఆరోపణలు

2లో

## మత విద్వేషాలు రెచ్చగొడితే కూటమి ప్రభుత్వం సహించదని హెచ్చరిక

### ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తూ, బతికున్న తల్లికి ఆస్తి ఇవ్వక క్షోభ పెడుతున్నాడు: సీఎం చంద్రబాబు

### బనగానపల్లెలో రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ

### కుల, మత, ప్రాంతాలతో సమాజాన్ని విడగొట్టేందుకు వైసీపీ కుట్ర చేస్తోందని చంద్రబాబు విమర్శ

### తీవ్రవాదాన్ని సమర్థించే వారికి గొడ్డలి పార్టీ ఆర్థిక సాయం చేస్తోందని ఆరోపణ

### తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తి సమాజానికి అవసరమా అని పరోక్ష విమర్శలు



"ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తూ, కళ్లెదుట బ్రతికున్న కన్నతల్లికి మాత్రం ఆస్తిలో వాటా ఇవ్వకుండా క్షోభ పెడుతున్న వ్యక్తి మనకెందుకు?" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కన్నతల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తులు రాష్ట్ర ప్రజలకు ఏం సేవ చేస్తారని ఆయన ప్రశ్నించారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు.దగత ప్రభుత్వ పెద్దల తీరును ఎండగడుతూ, "తిరుమలకు వెళ్లినప్పుడు డిక్లరేషన్ ఇవ్వడానికి నిరాకరించి అపచారం చేశారు. నేను మాత్రం చర్చికి, మసీదుకు వెళ్లినా అక్కడి ఆచారాలను గౌరవిస్తాను. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి వైసీపీకి చెందిన వాడే అని తెలియగానే

- మిగతా 2వ పేజీలో



## తలుపులు తెరవండి.. వేరే పార్టీల వారిని చేర్చుకోండి

### అప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుంది

### వచ్చే ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది

### రాష్ట్ర పార్టీ నేతలతో కేంద్రమంత్రి జేపీ నడ్డా

హైదరాబాద్: బీజేపీలోకి ఇతర పార్టీల వారిని చేర్చుకునేందుకు తలుపులు తెరవాలని రాష్ట్ర పార్టీ నేతలకు కేంద్ర ఆరోగ్య, రసాయనాలు--ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా సూచించారు. వేరే పార్టీలకు చెందిన వారిని కలుపుకుంటేనే బీజేపీ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. రాష్ట్ర పార్టీ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి

- మిగతా 2వ పేజీలో

# తలుపులు తెరవండి.. వేరే పార్టీల వారిని చేర్చుకోండి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొచ్చేలా చూడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ కచ్చితంగా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. 'మీరు కష్టపడి పనిచేయండి మీతోపాటు మేము ఉంటాం. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలను ప్రతి ఒక్కరూ అభిమానిస్తారు. మీ నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని అభిమానించేంతలా చూసుకోవాలి. కార్యకర్తలతో మంచిగా ఉండండి. వారితో మంచిగా లేకుంటే మీరు డిస్‌కనెక్ట్ అవుతారు'అని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు తమకు సమాచా రం ఉందన్నారు. గురువారం రాష్ట్రానికి వచ్చిన నడ్డా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశమైనప్పుడు ఈ కీలక వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. 'ఇప్పటికే ఒకసారి మన బస్సు (అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి) మిస్సయింది. ఇంకోసారి బస్సు మిస్ కానివ్వకండి. వేర్లు లేని చెట్ల లాగా మారకండి. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వ్యతిరేకతే మనల్ని గెలిపిస్తుందనే భావనతో ఉండకండి. సొంతంగా పార్టీ గెలిచేందుకు మనం ఏం చేస్తున్నాము అనేది కూడా చాలా ముఖ్యం. నేను అవినీతికి పాల్పడను. ఇంకొకరిని అవినీతి చేయనివ్వను అన్న ప్రాథమిక సూత్రంతోనే మోదీ విజయం సాధించారు. మనమంతా కూడా మోదీ పేరు చెప్పుకొని గెలుస్తున్నా...సొంతంగా గెలుపు కోసం అనుసరించబోయే కార్యాచరణ ఉందా ? మీ అంత మీరు గెలిచేందుకు ఏం చేస్తున్నారు? ఆత్మవిమర్శ చేసుకోండి. అవినీతితో పోరాడడంతోపాటు ఎల్లప్పుడూ ప్రజల పక్కనే చేదోడువాదోడుగా నిలిస్తే తప్పకుండా వారు ఆదరిస్తారు. మీ మీ కార్యక్షేత్రాలను వదలకుండా కష్టపడి పనిచేయాలి. లీడర్ల వెంట తిరిగినంత మాత్రాన లీడర్లు కాలేరు. రేపు కాంగ్రెస్ నేతలను (హిమాచల్‌లో) కలవడానికి వెళుతున్నాను. ఎందుకంటే వారిని కలిస్తే వారు మనవారు అవుతారు'అని నడ్డా దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డా.కె.లక్ష్మణ్, బీజేఎల?పనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీనేతలు పొంగులేటి సుధాకరరెడ్డి, గరికపాటిమోహన్‌రావు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, శాంతికుమార్, చింతల రామచంద్రారెడ్డి బండారు విజయలక్ష్మి, లంకెల దీపక్‌రెడ్డి, కప్పర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రభుత్వం ఏటీఎంగా మారిందని, అదే ప్రభుత్వం కొనసాగాలా? మారాలా? అన్నది రాష్ట్ర ప్రజలు నిర్ణయం తీసుకోవాలని జేపీ నడ్డా పిలుపునిచ్చారు.

## విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..


ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐదో రోజు (గురువారం) ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. సియోల్‌లో కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీ, ఇతర ఉన్నతాధికారులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్ల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అంతకుముందు, సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ డిస్‌ప్లే పరికరాల తయారీ సంస్థ సునిక్ సిస్టమ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు ముందుకొస్తే జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తన పర్యటనలో భాగంగా లోకేశ్.. దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో అమలు చేస్తున్న 3ఎ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని వివరించారు. ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కోరారు.

## మౌలిక వసతులపై భీకర దాడులు

దుబాయ్: చర్చలతో తేలదని, బాంబులతోనే తేల్చుకుంటామని ప్రకటించిన కొద్దిసేపటికే ఇరాన్‌పై క్షిపణుల వర్షం కురిపించి పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధాగ్నిని ప్రజ్వరిల్లజేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలతో రెండోరోజూ ఇరాన్‌పై అగ్రరాజ్యసేనలు విరుచుకుపడ్డాయి. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు, ఆయుధాగారాలు, ఎయిర్‌పోర్ట్ రన్‌వేలతోపాటు ఈసారి మౌలిక వసతులపై అమెరికా గురిపెట్టింది. దీంతో ఇరాన్‌లోని రైల్వేలైన్లు, వంతెనలు, నౌకాశ్రయాలు దాడుల బారిన పడ్డాయి. గత 48 గంటల్లో ఇరాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, క్షిపణి స్థావరాలు, సైనిక స్పీడ్ బోట్లు, మౌలికవసతులు ఇలా మొత్తంగా కీలకమైన 170 లక్ష్యాలపై దాడులు చేశామని అమెరికా సైనిక సెంట్రల్ కమాండ్ గురువారం ప్రకటించింది. హార్మూజ్ జలసంధి గుండా సరకు రవాణా నౌకల స్వేచ్ఛా వాణిజ్యాన్ని అడ్డుకునే ఇరాన్ సామర్థ్యాన్ని మరింతగా దెబ్బతీసే లక్ష్యంతోనే దాడులు చేస్తున్నామని సెంట్రల్ కమాండ్ స్పష్టంచేసింది. తొలిసారిగా చాబహార్ నౌకాశ్రయం మీదా దాడి చేసింది. నౌకల రాకపోకలను నియంత్రించే షాహీద్ బెహెష్తి మారిటైమ్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ సైతం ధ్వంసమైంది. చాబహార్‌లోని ఇరాన్ నేవీకి చెందిన ఇమామ్ అలీ స్థావరంపైనా అమెరికా యుద్ధవిమానాలు బాంబులు జారవిడిచాయి. బందర్ అబ్బాస్ నౌకాశ్రయం సమీపంలో ఎనిమిది పేలుళ్లు జరిగాయి. అబూ మూసా ద్వీపంపైనా అమెరికా దాడిచేసింది. బుషెహర్‌లోని అణు విద్యుత్‌కేంద్రం సమీపంలో గురువారం మధ్యాహ్నం బాంబుల శకలాలు పడ్డాయని ఇరాన్ ప్రకటించింది. అయితే దాడిలో న్యూక్లియర్ ప్లాంట్‌కు ఏమైనా నష్టం జరిగిందా లేదా అనే వివరాలను ఇరాన్ వెల్లడించలేదు.

# బలపడిన అణు బంధం

మెల్‌బోర్న్: భారత్, ఆస్ట్రేలియా మధ్య 'అణు'బంధం మరింత బలపడింది. భారత అణు విద్యుత్ ప్రాజెక్టులకు యురేనియం సరఫరా చేసేందుకు ఆస్ట్రేలియా ముందుకొచ్చింది. ఈ మేరకు ఇరుదేశాల మధ్య అత్యంత కీలకమైన పౌర అణుశక్తి ఒప్పందం కుదిరింది. సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ సహా సముద్ర భద్రత, అరుదైన ఖనిజాల రంగాలకు సంబంధించి పలు చరిత్రాత్మక ఒప్పందాలపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బానీస్ గురువారం మెల్‌బోర్న్‌లో సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. కీలక రంగాల్లో పరస్పరం సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆధునిక సాంకేతికతలు, సప్లై చైన్లు, రక్షణ, భద్రతా సహకారం, సముద్ర భద్రతా సహకార రోడ్‌మ్యాప్, ఇంధన భద్రత తదితర అంశాల్లో మొత్తం 18 ఒప్పందాలపై సంతకాలు జరగడం విశేషం. వీటిలో భారత తీర రక్షక దళం(ఐసీజీ), ఆస్ట్రేలియాకు చెందిన మారిటైమ్ బోర్డర్ కమాండ్(ఎంబీసీ) మధ్య జరిగిన ఒప్పందం కూడా ఉంది. ఇది సముద్ర చట్టాల అమలు, సముద్ర ప్రాంతాలపై అవగాహన, సముద్ర సరిహద్దుల రక్షణ వంటి అంశాలలో పరస్పర సహకారానికి దోహదపడుతుంది. ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం, ద్వైపాక్షిక పెట్టుబడి రక్షణ విధానాన్ని ఖరారు చేసే దిశగా కార్యాచరణను వేగవంతం చేయాలని భారత్, ఆస్ట్రేలియా నిర్ణయించాయి. ఓడల నిర్మాణం, మరమ్మతులు,



నిర్వహణలో కలిసికట్టుగా పనిచేయడానికి ఇరుపక్షాలు అంగీకారం తెలిపాయి. భారత్, ఆస్ట్రేలియాలు చారిత్రాత్మక పౌర అణు సహకార ఒప్పందంపై సంతకాలు చేసిన 12 ఏళ్ల తర్వాత పౌర అణుశక్తి ఒప్పందం కుదిరింది. ఇంధన భద్రతా ఫ్రేమ్‌వర్క్ నిబంధనల ప్రకారం.. బొగ్గు, డీజిల్, ఇతర ద్రవ ఇంధనాలు, సహజ వాయువుల స్థిరమైన, సురక్షితమైన, విశ్వసనీయమైన సరఫరాను కొనసాగించడం ద్వారా ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేశాయి. 2028--29 సంవత్సరానికి గాను ఆస్ట్రేలియన్ డిఫెన్స్ కాలేజీలో భారతీయ సైనిక శిక్షకుడిని నియమించాలని నిర్ణయించారు. మరోవైపు భారత్‌లోని గురుగ్రామ్‌లో విక్టోరియా విశ్వవిద్యాలయం తన క్యాంపస్‌ను నిర్వహించుకోవడానికి ఆస్ట్రేలియా పక్షానికి ఆమోద పత్రం అందజేశారు. బెంగళూరులో ఫ్లిండర్స్ యూనివర్సిటీ తన క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి అంగీకారం కుదిరింది. భేటీ అనంతరం మోదీ, అల్బానీస్ ప్రకటన విడుదల చేశారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి అల్బానీస్‌తో అద్భుతమైన చర్చలు జరిగాయని నరేంద్ర మోదీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చర్చల ఫలితాలను 'అసాధారణమైనవి'గా అభివర్ణించారు. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధనం, వాతావరణ చర్యలు, అణు శక్తి, కీలక ఖనిజాలు, సాంకేతికత, విద్య వంటి రంగాలపై చర్చించామని తెలిపారు. ఈరోజు అణు శక్తి రంగంలో ఒక కీలక ఒప్పందంపై సంతకం జరిగాయని అన్నారు. ఇది ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం సుగమం చేయడంతోపాటు భారత స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు నూతన శక్తిని ఇస్తుందని ఉద్ఘాటించారు. ఉగ్రవాదం అనేది కేవలం ఏదో ఒక దేశానికే కాకుండా మొత్తం మానవాళికి తీవ్రమైన సవాలుగా పరిణమించిందని భారత్, ఆస్ట్రేలియాలు గుర్తించినట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. అందుకే ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటం సాగిస్తామన్నారు. తమ సంకల్పం అచంచలమైనదని, సహకారం మరింత బలపడుతూనే ఉందని వెల్లడించారు. ఇండియాతో ఆస్ట్రేలియాకు ఉన్న సంబంధం నేడు ఉన్నంత కీలకమైనదిగా గతంలో ఎప్పుడూ లేదని ప్రధాని ఆంథోనీ అల్బానీస్ పేర్కొన్నారు. పౌర అణుశక్తికి సంబంధించిన ఒప్పందం శాంతియుత ప్రయోజనాల కోసం ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం ఎగుమతులను సులభతరం చేస్తుందని వివరించారు. శిలాజ రహిత ఇంధన విద్యుత్ సామర్థ్యం వాటాను పెంచడానికి భారత్‌కు యురేనియం సరఫరా చేయబోతున్నట్లు తెలిపారు.

ఇది నా ఆత్మగౌరవం మీద దాడి...

మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై నిరాధార ఆరోపణలు చేసి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని, ఇది తనకు, ప్రకాశ్ రెడ్డికి మధ్య జీవితకాలం జరిగే యుద్ధమని ప్రకటించారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని రాజకీయంగా వెంటాడతానని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేశారు. ఈ మేరకు మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ సందర్భంగా ఎంఎస్ రాజు మాట్లాడుతూ, "లేని ఆరోపణలు చేసి సమాజంలో నా గౌరవానికి భంగం కలిగించిన నిన్ను, నా ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టిన నిన్ను వదిలిపెట్టను. నీ అక్రమ ఆస్తుల దగ్గర నేనుంటా. నీ రాజకీయ పోరాటాన్ని చూస్తా. ఇది నా ఆత్మగౌరవం మీద జరిగిన దాడి. దున్నపోతు తల నరికే దొమ్మ పొగురున్న కులంలో పుట్టాను ప్రకాశ్.. భయం అనేది నాకు తెలీదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. తోపుదుర్తి కుటుంబ చరిత్రపై కూడా రాజు సంచలన ఆరోపణలు చేశారు. "రూ.800 కోసం లారీ డ్రైవర్‌తో తన్నులు తిన్న చరిత్ర మీ సోదరుడిది. చెప్పుల షాపులో కస్టమర్లు వదిలివెళ్లిన పాత చెప్పులు దొంగలించిన చరిత్ర మీ కుటుంబానిది. అద్దె ఇళ్లలో ఉంటూ యజమానులకు అద్దె చెల్లించకుండా వేధించిన చరిత్ర మీది. సిగ్గు లేకుండా నా గురించి మాట్లాడతారా?" అని ప్రశ్నించారు. తన ఆరాధ్య దైవం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల గురించి నీచంగా మాట్లాడిన ప్రకాశ్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డిని కటకటాల వెనక్కి పంపేంత వరకు తన పోరాటం ఆగదని రాజు స్పష్టం చేశారు. "నువ్వు ఎర మాత్రమే, నీ వెనక ఉన్న నీ అన్నే అసలు టార్గెట్" అని హెచ్చరించారు. తాను సామాన్య కుటుంబం నుంచి కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదని రాజు గుర్తుచేశారు. "టీడీపీ కార్యకర్తగా, పసుపు సైనికుడిగా ఉండటమే నాకు ఐదో పదవి. ప్రాణం ఉన్నంతవరకు పసుపు జెండా మోస్తా. చంద్రబాబు గారు నన్ను టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమిస్తే, దాన్ని ఆదాయ వనరుగా మార్చుకోలేదు. నా గదికి నేనే అద్దె కడతాను, కనీసం లడ్డూ కూడా తీసుకోను. కానీ మీరు టీటీడీని వ్యాపారంగా మార్చుకున్నారు" అని ఆరోపించారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని ప్రకాశ్ రెడ్డికి రాజు సవాల్ విసిరారు. "నాకు విల్లా ఎక్కడుంది? నా పార్టీ ఆఫీసు స్థలం ఎక్కడ? బెంగళూరులో నాకు ఆస్తులు ఎక్కడున్నాయో చూపించు. నీకు గురువారం వరకు సమయం ఇస్తున్నా. ఆరోపణలు నిరూపించు లేదా పరిణామాలకు సిద్ధంగా ఉండు" అని డిమాండ్ చేశారు. ఇది కేవలం రాజకీయ పోరాటం కాదని, తన ఆత్మగౌరవ పోరాటమని, తాను ఒక్కడినే పోరాడతానని ఎంఎస్ రాజు తేల్చిచెప్పారు.

## భారత్–పాక్ యుద్ధాన్ని నేనే ఆపేశా

వాషింగ్టన్: గత ఏడాది భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే స్వయంగా జోక్యం చేసుకొని నిలిపివేశానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఆయన బుధవారం తుర్కియే నుంచి తిరిగివస్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మాట్లాడారు. భారత్--పాక్ యుద్ధంలో 11 ఫైటర్ జెట్లు నేలకూలాయని చెప్పారు. అయితే, అవి ఏ దేశానికి చెందినవన్న సంగతి బయటపెట్టలేదు. భారత్--పాక్ యుద్ధం సహా ప్రపంచవ్యాప్తంగా 8 యుద్ధాలను తాను ఆపేశానని అన్నారు. ఈ ఘనత సాధించినందుకు నోబెల్ శాంతి బహుమ తికి తాను అన్నివిధాల అర్హుడినని స్పష్టంచేశారు.

## మత విద్వేషాలు రెచ్చగొడితే కూటమి ప్రభుత్వం సహించదని హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

తోక ముడిచారు. బతికున్న తల్లికి ఆస్తి ఇవ్వకుండా క్షోభ పెడుతూ, ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తున్నారు. తల్లికి గౌరవం ఇవ్వని ఇలాంటి వ్యక్తులు మన సమాజానికి అవసరమా " అని ప్రజలను ప్రశ్నించారు. "కుట్రలు, కుతంత్రాలతో కులం, మతం, ప్రాంతాల పేరుతో సమాజాన్ని విడదీసేందుకు 'గొడ్డలి పార్టీ' ప్రయత్నిస్తోంది. గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లను పెంచి పోషిస్తూ, రౌడీయిజంతో రాష్ట్రంలో విధ్వంసం సృష్టించింది" అని ఆయన ఆరోపించారు. గత పాలనలో హిందువుల మనోభావాలు దెబ్బతినేలా అనేక ఘటనలు జరిగాయని చంద్రబాబు గుర్తుచేశారు. "అంతర్వేది రథం దగ్ధం, దుర్గమ్మ గుడిలో వెండి సింహాల చోరీ, రామతీర్థంలో రాముడి విగ్రహ ధ్వంసం వంటి ఘటనల్లో గత పాలకులు నిందితులపై కనీస చర్యలు తీసుకోలేదు. చివరికి తిరుపతి వెంకన్న ప్రసాదాన్ని సైతం కల్తీ చేసి భక్తుల నమ్మకాన్ని వమ్ము చేశారు. మేం ఇలాంటి వాటిని ప్రక్షాళన చేస్తున్నాం. రెండు రోజుల క్రితం ఆదోని శివాలయంలో దీపంతో సిగరెట్ వెలిగించిన దుర్మార్గుడిని వెంటనే అరెస్ట్ చేశాం. మత విద్వేషాలు రగిలించే చర్యలను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించదు" అని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో కొందరు చేస్తున్న దుష్ప్రచారంపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "'రావణ్' అనే వ్యక్తి హిందూ పురాణాలను, శ్రీరాముడిని, సీతాదేవిని కించపరుస్తూ మాట్లాడుతున్నాడు. తీవ్రవాదాన్ని, పాకిస్థాన్‌ను సమర్థించే ఇలాంటి వారికి 'గొడ్డలి పార్టీ' ఆర్థిక సహాయం అందించడం ఎంతటి బరితెగింపు? 'హే రామ్' అంటూనే రావణుడిని ప్రోత్సహించే వారిని ఏమనాలో అర్థం కావడం లేదు. కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చెప్పిన వింతలు, విచిత్రాలు ఇప్పుడు చూస్తున్నాం" అని అన్నారు. సభ అనంతరం ముఖ్యమంత్రి వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. వెదురుతో చేసిన ఆభరణాలను ఆసక్తిగా పరిశీలించారు.

## బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్

మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోక్సో (గాజూూా) చట్టం కింద అరెస్టయి చంచల్‌గూడ జైలులో ఉన్న బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఎట్టకేలకు తుది తీర్పును వెలువరించింది. దర్యాప్తు ముగిసి ఛార్జ్‌షీట్ దాఖలు చేసే దశకు రావడం, నిందితుడు ఇప్పటికే 49 రోజులకు పైగా జైలు శిక్ష అనుభవించిన నేపథ్యంలో హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు నిందితుడికి కొన్ని కీలక షరతులను విధించింది. లక్ష రూపాయల విలువైన వ్యక్తిగత బాండ్లతో పాటు ఇద్దరు పూచీకత్తులను (షూరిటీలను) సమర్పించాలని స్పష్టం చేసింది. దర్యాప్తుకు సహకరించాలని, సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభావితం చేయడానికి ప్రయత్నించకూడదని న్యాయస్థానం ఆదేశించింది.

# మమ్మల్ని కొన్నాళ్లు పని చేయనివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నామన్నారు. కాలుష్యం కారణంగా దేశ రాజధాని ఢిల్లీ లాంటి నగరాల్లో నివసించలేని పరిస్థితి తలెత్తిందని, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని సీఎం పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ నగరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అందుకే హైదరాబాద్ నగరంలో కాలుష్య రహిత అభివృద్ధి జరగాలని నిర్ణయించామని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 2,100 చ.కి.మీ విస్తీర్ణంలోని క్యూర్ ఏరియాను పూర్తిగా సర్వీస్ సెక్టార్‌గా నిర్ణయించామని తెలిపారు. ప్రస్తుతం వైట్‌కాలర్ ఉద్యోగాలకు కాలం చెల్లింది. స్కిల్స్ ఉన్న వారికి బ్లూకాలర్ జాబ్స్‌కు కొదవ లేదు. ఇప్పటివరకు అమెరికా వైపు చూశాం. ప్రస్తుతం జర్మన్, జపాన్, చైనా, సౌత్ కొరియాను ఆదర్శంగా తీసుకుంటున్నాం. ఆయా దేశాలతో పోటీపడదాం. రాష్ట్రంలో ఏటా 10 లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు తీసుకుని బయటికి వస్తున్నారు. సంబంధిత సాంకేతిక నైపుణ్యం లేకపోవడంతో పది శాతం మందికి కూడా ఉద్యోగ అవకాశాలు లభించడం లేదు. వీరి నైపుణ్యాలను పెంచి, అవకాశాలు కల్పించే బాధ్యతలను పరిశ్రమలు తీసుకోవాలి. రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలని సంకల్పించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10 శాతం భాగస్వామ్యం కలిగి ఉండటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. సీతారాంపురంలో సోలార్ మాడ్యూల్ ప్లాంట్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందంటూ.. గ్రామంలో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు, ఉపాధి కోసం వ్యాపార సముదాయాలను నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు త్యాగం చేయడం వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ విశ్వవ్యాప్తం కావాలి: మంత్రి శ్రీధర్‌బాబు 'కేవలం పెట్టుబడులు ఆకర్షించడమే కాదు. ఆవిష్కరణలు, తయారీ ఇక్కడే జరగాలి. మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా ఇక్కడి నుంచే ప్రపంచానికి ఉత్పత్తులను అందించాలి. ఇదే మా ప్రభుత్వ సంకల్పం'అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రీమియర్ ఎనర్జీస్ లాంటి ప్రపంచ స్థాయి సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు తెలంగాణను ఎంచుకోవడం ఇక్కడి పారిశ్రామిక ప్రగతికి, రాష్ట్ర ప్రభుత్వంపై ఇన్వెస్టర్లకు ఉన్న విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.

**3 వేల మందికి ఉపాధి అవకాశాలు**


సోలార్ మాడ్యూళ్ల తయారీ కేంద్రం 75 ఎకరాల్లో ఏర్పాటైంది. యూనిట్ పూర్తి సామర్థ్యానికి చేరుకుంటే 3 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయి. కంపెనీ 6 గిగావాట్ల సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఫెసిలిటీతో పాటు ఏటా 18 వేల మెట్రిక్ టన్నుల తయారీ సామర్థ్యంతో రానున్న అల్యూమినియం ఫ్రేమ్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసింది. దేశవ్యాప్తంగా ప్రస్తుత కేంద్రాల విస్తరణ, నూతన ఫెసిలిటీల కోసం సంస్థ 2028 నాటికి సుమారు రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తోంది.

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఖమ్మం--బోనకల్ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు...పోలీస్ కమీషనర్ సునీల్ దత్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాష్ట్ర ముఖ్యమంత్రి శుక్రవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ నేపథ్యంలో ఖమ్మం-- బోనకల్ ప్రధాన రహదారిపై ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం, మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభకు వచ్చే రైతులు, ప్రజలు, అధికారులు, మీడియా, తదితర వాహనాలు మినహా ఖమ్మం నుండి బోనకల్ కు సాధారణ వాహనాల రాకపోకలు నిలిపివేయడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ట్రాఫిక్ రద్దీ ని దృష్టిలో పెట్టుకొని ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 12:00 గంటల వరకు ఆంక్షలు అమలులో వుంటాయని, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వెళ్లాలని సూచించారు. ఖమ్మం నుంచి వయా పందిళ్లపల్లి, చింతకాని, బోనకల్, ఆంధ్రకు వెళ్లే వాహనాలు నేలకొండపల్లి మీదుగా వెళ్లాలని, అదేవిధంగా బోనకల్లు నుంచి ఖమ్మం వైపు వచ్చే వాహనాలు వైరా మీదుగా రావాలన్నారు. ధాంసలాపురం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు దగ్గర నుంచి బోనకల్ బ్రిడ్జి వరకు సాధారణ వాహనాల రాకపోకలు అనుమతించ బడదన్నారు. హైదరాబాదు నుంచి మీటింగ్ కి వచ్చే విఐపి వాహనాలు కోదాడ, నేలకొండపల్లి, ముదిగొండ లోని వల్లపురం నుంచి మీటింగ్ స్థలం కి త్వరగా చేరుకోవచ్చు.






**రైతు ఆశీర్వాద సభ కు వచ్చే ప్రజల సౌకర్యార్థం వాహనాల పార్కింగ్ మార్గాలు**

చింతకాని మండలం, జగన్నాథపురం గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రైతు ఆశీర్వాద సభ కు వచ్చే ప్రజల సౌకర్యార్థం, ట్రాఫిక్ రద్దీ నివారణకు మండలాల వారీగా ప్రత్యేక వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేయడమైనదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ప్రజలు తమకు కేటాయించిన మార్గంలో ప్రయాణించి, సంబంధిత పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను నిలిపివేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. తమ మండలానికి కేటాయించిన రూట్ ద్వారా మాత్రమే ప్రయాణించాలన్నారు. పోలీసు అధికారులు మరియు ట్రాఫిక్ సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలి. ప్రధాన రహదారులపై వాహనాలను నిలిపి వేయకుండా సభ విజయవంతానికి సహకరించాలన్నారు. రూట్ నెం. -- 1 (పార్కింగ్ నెం. 1 నుండి 5 వరకు) క్రింది మండలాల నుండి వచ్చే ప్రజలు రూట్ నెం. 1 ద్వారా వచ్చి వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలిపివేయాలి.

**ఖమ్మం (టౌన్ డ రూరల్)**

కామేపల్లి, నేలకొండపల్లి, ముదిగొండ, కామేపల్లి, సింగరేణి, తిరుమలాయపాలెం.

**రూట్ నెం. -- 2 (పార్కింగ్ నెం. 7, 8 మరియు 15) క్రింది మండలాల నుండి వచ్చే ప్రజలు రూట్ నెం. 2 ద్వారా రావాలి.**

చింతకాని, వైరా, ఏన్కూరు, దమ్మపేట, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, చంద్రుగొండ., రూట్ నెం. -- 3 (పార్కింగ్ నెం. 10, 11, 12, 13 మరియు 14)

క్రింది మండలాల నుండి వచ్చే ప్రజలు రూట్ నెం. 3 ద్వారా రావాలి.

మధిర, ఎర్రుపాలెం, బోనకల్

**వీఐపీ పార్కింగ్ : 9**

ప్రత్యేక పార్కింగ్ వి.వి.ఐ.పి. పార్కింగ్ – నెం. 6: వి.ఐ.పి.లు మరియు ప్రభుత్వ అధికారులు :9

# 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో తెలంగాణ పోలీస్ అకాడమీ విజయదుందుభి

**26 పతకాలతో అకాడమీ క్రీడాకారుల అద్భుత ప్రతిభ**

గండిపేట(క్రైమ్ మిర్రర్): జూలై 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్--క్లస్టర్(ఏ) పోటీలలో తెలంగాణ పోలీస్ అకాడమీ క్రీడాకారులు విశేష ప్రతిభకనబరిచి మొత్తం 26 పతకాలు సాధించి అకాడమీకి మరోసారి గర్వకారణంగా నిలిచాఇరు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ నాయకత్వంఓ అసిస్టెంట్ డైరెక్టఱ్ టి.ఎ.భారత్ పర్యవేక్షణలో పోటీలకు సిద్ధమైన అకాడమీ జట్టు వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది, వెయింట్ లిఫ్టింగ్, యోగా, పెంచక్ సిలాట్, తైక్వాండో, ఆర్మ్ రెజ్లింగ్ బాడీ బిల్డింగ్థ, రెజ్లింగ్ వంటి విభాగాల్లో క్రీడాకారులు ప్రతిభ చాటుతూ మొత్తం 3 స్వర్ణ, 9 రజత, 14 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. మహిళా, పురుష క్రీడాకారులు సమాన ఉత్సాహంతో పోటీల్లో పాల్గొని వ్యక్తిగత జట్టు విభాగాల్లో విజయాలు సాధించడం విశేషం. ఈ విజయాలు అకాడమీలో అందిస్తున్న నాణ్యమైన శిక్షణ, క్రమ శిక్షణ, శారీరక దృఢత్వానికి నిదర్శనంగా నిలిచాయి. పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అకాడమీ డైరెక్టర్ అభినందిస్తూ రాష్ట్ర పోలీసు శాఖకు మరిన్ని విజయాలు అంఇంచాలని ఆకాంక్షించారు. క్రీడాస్ఫూర్తి, శారీరక సామర్థ్యం, మానసిక దఢత్వం ప్రతి పోలీసు ఉద్యోగికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి పాల్గొన్న 26 మందిలో కానిస్టేబుల్ వై.శ్రీను 7, పిసి పరశురామ్ 4, ఏఆర్ఎస్ఐ ఆంజనేయులు 3, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ 2, ఏఆర్ఎస్ఐ వవజరెడ్డి 2, పిసిలు మాధూరి, పద్మవతిలు 2 చొప్పున, డిఎస్‌పి జగదీశ్వర్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, ఏఆర్ఎస్ఐ సురేష్‌లు ఒక్కొటి చోప్పున 26 వివిధ క్రీడల్లో ధించారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో తెలంగాణ పోలీస్ అకాడమీ క్రీడాకారులు సాధించిన ఈ విషయాలు అకాడామీ క్రీడా సంస్కృతి, శిక్షణా నాణ్యతకు, సిబ్బంది అంకితభావానికి మరో మైలురాయిగా నిలిచాయి. అకాడీమీ టీం మేనేజర్‌గా డిఎస్‌పి తిరుపతి వ్యవహరించారు.



## 38 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి.. శివరాంపల్లి ZPHS 1988-89 బ్యాచ్ స్కూల్ మిత్రుల ఆత్మీయ కలయిక





గండిపేట(క్రైమ్ మిర్రర్): కాలం మారింది.. వయసు పెరిగింది.. జీవితంలో ఎవరి దారి వారు చూసుకుని విడిపోయారు.. కానీ, బాల్యపు జ్ఞాపకాలు మాత్రం వారిని మళ్లీ ఒకే చోటుకి చేర్చాయి. శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1988–1989 విద్యాసంవత్సరం నాటి పదో తరగతి బ్యాచ్ మిత్రులు సుదీర్ఘ కాలం తర్వాత మళ్లీ కలుసుకున్నారు. పాఠశాల విద్య ముగించుకుని దాదాపు 38 సంవత్సరాలు గడిచిన తర్వాత, పాత మిత్రులంతా గురువారం బాబుల్ రెడ్డి నగర్ సోమ శ్రీనివాస్ గుప్తా,కార్యాలయం (ఆఫీస్) నందు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎప్పుడో మూడు దశాబ్దాల క్రితం క్లాస్ రూమ్‌లో కలిసి చదువుకున్న స్నేహితులు ఇప్పుడు ఒకరినొకరు చూసుకుని ఆనందంతో మురిసిపోయారు. ఈ ఆత్మీయ కలయికలో మిత్రులంతా తమ చిన్ననాటి ముచ్చట్లను, పాఠశాల రోజుల్లో చేసిన అల్లరిని, గురువుల బోధనలను గుర్తు చేసుకుంటూ జ్ఞాపకాల్లో తేలియాడారు. ప్రస్తుతం తాము నిర్వర్తిస్తున్న వృత్తులు, కుటుంబ విషయాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ, ఇంతకాలం తర్వాత స్నేహితులమంతా ఇలా ఒకే చోట కలుసుకోవడం తమ జీవితంలో మరువలేని అనుభూతిని ఇచ్చిందని భావోద్వేగానికి లోనయ్యారు. రాబోయే రోజుల్లో మిగతా క్లాస్‌మేట్స్‌ను కూడా సంప్రదించి, మరింత పెద్ద ఎత్తున స్నేహితుల కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా వారు నిర్ణయించుకున్నారు.

## శంషాబాద్ శాతంరాయి వద్ద ఘోర ప్రమాదం

**ఓవర్‌టేక్ చేయబోయి ఇద్దరు మహిళలను బలితీసుకున్న బొలెరో**







గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ సమీపంలోని శాతంరాయి వద్ద బుధవారం మధ్యాహ్నం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ఒక బొలెరో వాహనం అదుపుతప్పి ఢీకొట్టడంతో రహదారి దాటుతున్న ఇద్దరు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం శాతంరాయి పరిధిలోని రాజీవ్ గృహకల్పకు చెందిన సుమ (55), చిలకమర్తి సువర్ణ (66) అనే ఇద్దరు మహిళలు శంషాబాద్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్నారు. జూలై 9వ తేదీ మధ్యాహ్నం సుమారు 3:30 గంటల ప్రాంతంలో వారు శాతంరాయి బస్ స్టాప్ సమీపంలో రహదారి దాటుతున్నారు. అదే సమయంలో శంషాబాద్ వైపు నుండి శాతంరాయి వైపు కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో కూడిన ఒక బొలెరో వాహనం (ఖాా13ాూా4726) అతివేగంగా దూసుకొచ్చింది. ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బొలెరో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో అదుపుతప్పిన వాహనం రోడ్డు దాటుతున్న సుమ, సువర్ణలను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఇద్దరు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్‌ను కర్ణాటకకు చెందిన లక్ష్మణ్ కుమారుడు జైసన్ వి.ఎల్ (21) గా గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారించిన పోలీసులు, అతనిపై చట్టపరమైన చర్యల నిమిత్తం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## ఆత్మకూరు(ఎం)పిఏసీఎస్ చైర్మన్ గా నియామకమైన యాస లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు



**ఆత్మకూరు(ఎం),జూలై09/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం గురువారం ప్రభుత్వం ఆలేరు నియోజకవర్గంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నియమించిన చైర్మన్లలో ఆత్మకూరు(ఎం) మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా మాజీ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి నియామకం అయిన సందర్భంగా వారికి యాదాద్రి భువనగిరి జిల్లా రెడ్డి సంఘం నాయకులు నోముల రవిందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

## చౌటుప్పల్ కోర్టును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



**చౌటుప్పల్,జులై 9, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన పరిశీలన కొరకు చౌటుప్పల్ కోర్టుకు గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు విచ్చేసి చౌటుప్పల్ కోర్టును పరిశీలించి నూతన కోర్టు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బారసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్,సహాయ కార్యదర్శి మక్తల నరసింహ, కార్యవర్గ సభ్యులు ఎండి ఖయ్యూం పాష, మాజీ అధ్యక్షులు అల్లమోని శ్రీనివాస్, బాల్యం వెంకట చలపతి, జల్లా రమేష్, పరమేష్, రవీందర్, కట్టెల లింగస్వామి, కోర్టు సిబ్బంది ఏవో రామకోటి, చంద్రిక, అమర్ బిన్ నాజీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు ఎన్యూమరేషన్ ఫామ్‌లను పూరించి బీఎల్‌వోలకు అందించాలి

**తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి**






**గండిపేట(క్రైమ్ మిర్రర్): :** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమానికి సహాయంగా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక్షంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం వద్దకు వచ్చిన ఓటర్లతో మాట్లాడిన తోకల శ్రీనివాస్‌రెడ్డి ఎన్యూమరేషన్ ఫామ్ నింపే విధానం గురించి అవగాహన కల్పిస్తూ వారికి ఉన్న సందేహాలను నివత్తి చేశారు. ప్రతి ఓటరు తమ వ్యక్తిగత వివరాలను సరైన విధంగా నమోదు చేసి నిర్ధేశిత గడువులలోగా సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్‌కు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి, ఉద్యోగాలు లేదా ఇతర కారణాలతో వలస వచ్చి నివసిస్తున్న ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి ఈ విధంగా ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సహాయ కేంద్రాలు ఎంతో ఉపయోగంగా ఉండి, ఫారాలు సులభంగా, తప్పులు లేకుండా నింపేందుకు దోహదపడుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ ఎస్ఐఆర్ కార్యక్రమం ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు అత్యంత కీలకమని ఆయన అన్నారు. అందువల్ల ప్రతి అర్హత కలిగిన ఓటరు ఈ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని, తమ వివరాలను సక్రమంగా నమోదు చేసి సంబంధిత బిఎల్‌వోలకు సమర్పించాలని పిలుపునిచ్చారు. అలాగే పన్రజలు ఏవైనా సందేహాలు లేదా సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటే సమీపంలోని ఎస్ఐఆర్ సహాయ కేంద్రాలను సంప్రదించి అవసరమైన మార్గదర్శకత్వం పొందాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జి.పాండుయాదవ్, సంతోష్ గౌడ్, రమేష్‌రెడ్డి, చెన్నమ్మ, గోపాల్‌నాయక్, శంకర్‌రెడ్డి, రాజ్‌స్వామి, కిరణ్, మహేష్ తదితరులున్నారు.

క్రైమ్ మిర్రర్

ఎడిటోరియల్

4

శుక్రవారం

10-7-2026

# గందరగోళంలో వ్యవసాయం



ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన మరింత ఎక్కువయ్యింది. తాగు,సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడబోతున్నాయి. ఈయేడు సాగు సాగడమెలా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. జులై మధ్యలోకి వచ్చినగా గట్టి వర్షాలు లేవు. దీంతో వరిసాగు సాగదని రైతులే చెబుతున్నారు. నారు ఎండిపోతోంది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు గోదావరిలో కొత్తో గొప్పో నీళ్లు వస్తున్నాయి తప్ప, కృష్ణా పివాహక పూర్తిగా ఎండిపోయినట్లే. ఇప్పటికే వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లతో సతమతమవుతోంది. దేశానికి అన్నం పెట్టే రైతు అనేక సమస్యలమధ్య జీవన పోరాటం సాగిస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, పెరు గుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. రైతుకు ప్రకృతి శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు ఆకాల వర్షాలు, వరదలు, వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతున్నాయని అనుకుంటే ఇప్పుడు ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగా మారింది. రైతు ఎంత కష్టపడి పంట పండించినా ప్రకృతి వైపరీత్యాలు అతని ఆశలను ఆవిరి చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభ మైన వ్యవసాయరంగం ప్రస్తుతం అనేక సవాళ్లతో కొట్టు మిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుండి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. రైతు పెట్టుబడి పెట్టే కాలం నుండి పంట చేతికి వచ్చే వరకు అంతా ప్రకృతి చేతుల్లోనే ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల ఒక ఏడాది తీవ్రమైన కరువు ఏర్పడితే, మరో ఏడాది అకాల వర్షాలు, తు ఫానులు, వరదలు పంటలను ముంచెత్తుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడం తో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది. ఎల్‌కనినో తట్టుకునేలా రైతులకు అత్యవసర సాయానికి ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి. ఇకపోతే వ్యవసాయంలో పెట్టు బడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. పంటదిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. దీంతో అప్పులు చేయడం తప్ప రైతుకు మరో మార్గం కనిపించడం లేదు. పంటించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ధాన్యం కొంటారన్న గ్యారెంటీ లేదు. దీనికితోడు నకిలీ విత్తనాల సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. అధిక దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయించే నకిలీ విత్త నాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు దెబ్బతిన దంతో రైతు కుదేలవుతున్నాడు. మరోవైపు ఎరువుల కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సీజన్ సమయంలో ఎరు వుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరి స్థితి ఏర్పడుతోంది. అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. నేడు వ్యవసాయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. కూలీల ఖర్చులు, ట్రాక్టర్ల అద్దెలు, డీజిల్ ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్టుబడి రెట్టింపవుతున్నా దానికి తగ్గట్టుగా పంటకు మద్దతుధర లభించడం లేదు. మార్కెట్ల లో దళారుల వ్యవస్థ, సిండికేట్లుగా మారిన వ్యాపారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుది. పెట్టుబడులు పెరిగి, పంట చేతికిరాక, వచ్చిన పంటకు సరైన ధర దక్కకపోయేసరికి రైతు పూర్తిగా అప్పుల్లో మునిగిపోతాడు. బ్యాంకుల నుండి రుణాలు దొరకని చిన్న, సన్న కారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. వారు విధించే చక్రవడ్డీలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక సమాజంలో గౌరవం కోల్పోతామనే భయంతో ఎంతో మంది రైతులు పురుగుల మందుతాగి తనువు చాలిస్తున్నారు. ఇంకొందరు ఉరివేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రుణాల విధానం సక్రమంగా లేకపోవడంతో బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. వంట నష్టాలు, ఆదాయం లేక పోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించా లంటే ప్రభుత్వాలు రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. న కిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకో వాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో ఉంచాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవ సాయరంగం బలోపేతం కావాలంటే రైతు బాగుండాలి. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి మూలాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో నుంచి గట్టెక్కేందుకు తగన వ్యవసాయ ప్రణాళికలు అమలు చేయాలి.

# పసివాడి నవ్వు... పెద్దలకొక పాఠం!

**ఉదయం ఏడు గంటలు. నగరంలోని ప్రధాన బస్టాండ్ అప్పుడే జనంతో కిక్కిరిసిపోయింది. ఎటు చూసినా ఒకటే తొందరపాటు, ఒకటే పరుగుల లంఘనం. ఆఫీసులకు ఆలస్యమవుతుందనే ఆందోళన కొందరిదైతే, వ్యాపారాల వేటలో పడిన ఆరాటం మరికొందరిది. ఎవరి ముఖంలో చూసినా ఒక అపరిమితమైన టెన్షన్, అలసట, జీవితంపై ఏదో తెలియని అసంతృప్తి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.అదే సమయంలో, సరిగ్గా బస్టాండ్ మూలన ఉన్న ఒక చిన్నారి, తన తల్లి చేతిని గట్టిగా పట్టుకుని నిలబడింది. దారి పక్కన ఉన్న పూలమొక్కపై ఎగురుతున్న ఒక చిన్న సీతాకోకచిలుకను చూసి ఆ పాప ఒక్కసారిగా పకపకా నవ్వింది. ఆ నవ్వులో ఎలాంటి కల్మషం లేదు, ఎలాంటి లౌక్యపు లెక్కలు లేవు, రేపటి గురించిన ఆందోళన అస్సలే లేదు.**



కేవలం ఆ క్షణం, ఆ రంగుల రెక్కల అందం అంతే! ఈ దృశ్యం మన దైనందిన జీవితంలో నిత్యం ఎక్కడో ఒకచోట చూస్తూనే ఉంటాం. కానీ ఆధునిక కాలపు ఉరుకుల పరుగుల జీవితంలో మనం ఎప్పుడైనా ఒక్క క్షణం ఆగి, ఆ పసిపాప నవ్వు వెనుక దాగి ఉన్న గొప్ప జీవన తత్వాన్ని గమనించే ప్రయత్నం చేశామా? అంటే సమాధానం శూన్యమనే చెప్పాలి.నిజానికి బాల్యం అనేది కేవలం మానవ జీవితంలో దాటిపోయే ఒక శారీరక దశ మాత్రమే కాదు. అది ఒక అద్భుతమైన జీవన తత్వశాస్త్రం. పిల్లలు ఎలాంటి వేదాంత గ్రంథాలు చదవరు, ఏ మహానుభావుల ఉపన్యాసాలూ వినరు. అయినా వారి రోజువారీ ప్రవర్తనలో, వారి ఆలోచనా విధానంలో పెద్ద పెద్ద మేధావులకు సైతం అందని అపారమైన జీవిత సత్యాలు దాగి ఉంటాయి. ఉదాహరణకు, ఒక పసిపిల్లవాడు తన చేతిలో ఉన్న ఒకే ఒక్క బిస్కెట్‌ను కూడా పక్కనున్న మరో పిల్లోడితో ఎలాంటి స్వార్థం లేకుండా సంతోషంగా పంచుకుంటాడు.అలాగే, ఆటలాడుకుంటూ ఇద్దరు పిల్లలు కొట్లాడుకున్న పది నిమిషాలకే, మళ్ళీ పాత విషయాలన్నీ మర్చిపోయి హాయిగా కలిసిపోతారు. వారి మనసుల్లో ఎలాంటి పగ, ద్వేషం, ఈర్ష్య అనేవి అస్సలు నిలవవు. వారికి నిఘంటువుల్లోని క్షమాపణ అనే పదం యొక్క నిర్వచనం తెలియకపోవచ్చు, కానీ సహజంగానే క్షమించి వదిలేసే గొప్ప గుణం వారి రక్తంలోనే ఉంటుంది.మరోవైపు పెద్దలుగా మారిన మనం ఏం చేస్తున్నాం? ఏళ్ల తరబడి పాత గొడవలను, ఈగోలను మనసులోనే అణచిపెట్టుకుని, లోలోపల కుతకుతలాడుతూ బతుకుతుంటాం. ఒక చిన్న మాట అపార్థమైతే చాలు, దశాబ్దాల నాటి ప్రాణస్నేహాలను సైతం ఒక్క క్షణంలో తుంచేసుకుంటాం. కానీ పిల్లలు అలా కాదు. వారి మనసు ఎప్పుడూ ఒక స్వచ్ఛమైన తెల్లకాగితం లాంటిది. ఏ క్షణంలో ఏం జరిగితే అదే వారికి ముఖ్యం, గతం యొక్క భారం వారిపై ఎప్పుడూ పడదు.పిల్లల్లో కనిపించే మరో అద్భుతమైన సామాజిక లక్షణం నిరంతరం ప్రశ్నించే తత్వం. ఆకాశం ఎందుకు నీలంగా ఉంటుంది?,మనం నడుస్తుంటే చంద్రుడు కూడా మనతోనే ఎందుకు వస్తున్నాడు? అని అడిగే పిల్లలు, తమకు తెలియని విషయాన్ని అంగీకరించడానికి ఎప్పుడూ భయపడరు. ఒక విషయం తమకు తెలియదని ఒప్పుకోవడంలో వారికి ఎలాంటి సిగ్గు గానీ, సంకోచం గానీ ఉండదు.కానీ పెద్దయ్యాక సమాజంలో మన పరిస్థితి పూర్తి భిన్నంగా మారుతుంది. సమాజంలో ఎక్కడ మన గౌరవం తగ్గిపోతుందో, ఇతరులు మనల్ని తక్కువగా చూస్తారేమోనన్న భయంతో నాకు తెలియదు అని చెప్పడానికే సాహసించం. మన అహం (ఇగో) మనల్ని చుట్టుముట్టి, కొత్త విషయాలను నేర్చుకోకుండా అడ్డుగోడలా నిలుస్తుంది. పిల్లలకు ఈ అహం అనే పదమే తెలియదు కాబట్టే, వారు ప్రతిరోజూ నిరభ్యంతరంగా, ఏ మొహమాటం లేకుండా కొత్త విషయాలను నేర్చుకుంటూ నిరంతరం ఎదుగుతుంటారు.ప్రస్తుత సమాజంలో పెద్దలంతా ఎదుర్కొంటున్న అతి పెద్ద మానసిక సమస్య వర్తమానంలో బతకలేకపోవడం. మనం ఎప్పుడూ జరిగిపోయిన గతం గురించి కుంగుబాటుకు గురవుతూనో, లేదా ఇంకా రాని భవిష్యత్తు గురించి అతిగా ఆందోళన పడుతూనో అమూల్యమైన సమయాన్ని వృథా చేస్తాం. వర్తమానంలో ప్రశాంతంగా బతకడం అనేది నేటి మనిషి దాదాపుగా మర్చిపోయిన ఒక అరుదైన కళ.కానీ ఈ విషయంలో పిల్లలను గమనిస్తే ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. బయట భారీగా వర్షం పడుతుంటే, గొడుగు పట్టుకుని సురక్షితంగా ఇల్లు చేరాలనే ఆలోచన పెద్దలదైతే ఆ వర్షపు నీటిలో తడుస్తూ, కాగితపు పడవలు వదులుతూ గంతులేయడం పిల్లల నైజం. సముద్రపు ఒడ్డున ఇసుకతో ఎంతో ఇష్టంగా కోటలు కడతారు, అవి అలల తాకిడికి కూలిపోతాయని తెలిసినా వారు బాధపడరు. కూలిపోతే మళ్ళీ అంతే ఉత్సాహంతో కొత్తగా కట్టడం ప్రారంభిస్తారు. వారికి ప్రతి క్షణం ఒక సరికొత్త అనుభూతి. ఇప్పుడు అనే ఈ క్షణాన్ని పరిపూర్ణంగా ఆస్వాదించడం వారికి ప్రకృతి ప్రసాదించిన వరం.నిష్కల్మషమైన ప్రేమ, తెలియనిదాన్ని అంగీకరించే అద్భుతమైన ధైర్యం, వర్తమానంలో జీవించే అరుదైన గుణం వీటన్నింటినీ కలిపి చూస్తే మనం ఒకే ఒక్క మాటలో చెప్పొచ్చు, అదే సరళత . పిల్లలు జీవితంలో ఎలాంటి సంక్లిష్టతలను ఇష్టపడరు. వారి దృష్టిలో జీవితం అంటే సంతోషాన్ని వెతుక్కోవడం, బాధను వెంటనే మర్చిపోవడం, ప్రేమనైనా, కోపాన్నైనా దాచుకోకుండా వెంటనే వ్యక్తపరచడం.కానీ మనం పెద్దయ్యే కొద్దీ సమాజం నేర్పిన పోకడలతో జీవితాన్ని అనవసరంగా సంక్లిష్టం చేసుకుంటున్నాం. డబ్బు, సామాజిక హోదా, ఆస్తుల పోటీ, ఒకరితో ఒకరిని పోల్చుకోవడం వీటన్నింటి మధ్య పడి అసలైన అంతర్గత సంతోషాన్ని పూర్తిగా కోల్పోతున్నాం. ప్రతి విషయాన్ని వ్యాపార లాభనష్టాల కోణంలోనే బేరీజు వేసే ఈ యాంత్రిక జీవన విధానంలో, ఒక చిన్నారి నవ్వు మనకు నిరంతరం ఒక విషయాన్ని గుర్తు చేస్తూనే ఉంటుంది నిజమైన ఆనందానికి కోట్ల రూపాయల ఆస్తులు, లగ్జరీ కార్లు అవసరం లేదు, మనసును ఆహ్లాదపరిచే ఒక చిన్న సీతాకోకచిలుక చాలని!ఈ ఆధునిక కాలంలో మానసిక ఒత్తిడి, తీవ్రమైన ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక రుగ్మతలు విపరీతంగా పెరిగిపోవడానికి ప్రధాన కారణం మన జీవనశైలిని మనమే అతిగా క్లిష్టతరం చేసుకోవడమేనని మనస్తత్వ నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియాలో ఇతరుల కృత్రిమ జీవితాలతో మనల్ని మనం పోల్చుకుంటూ బాధపడటం, ఇతరుల మెప్పు కోసం మన నిజమైన వ్యక్తిత్వాన్ని చంపేసుకోవడం వంటివి మనల్ని సంతోషానికి దూరం చేస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో మనం పిల్లల నుండి జీవన పాఠాలను నేర్చుకోవాల్సిన అత్యవసర స్థితి ఏర్పడింది. కక్షలను వీడి క్షమించడం నేర్చుకోవాలి, ఎందుకంటే పగను మోయడం వల్ల మన మనసుకు అలసట తప్ప ఏమీ మిగలదు. తెలియని విషయాలను నిర్మొహమాటంగా అడగడం నేర్చుకోవాలి, ఎందుకంటే అజ్ఞానాన్ని ఒప్పుకోవడం బలహీనత కాదు, అది జ్ఞానానికి మొదటి అడుగు. అలాగే, గతం, భవిష్యత్తు మన చేతుల్లో లేవు కాబట్టి వర్తమానాన్ని ప్రేమించడం అలవర్చుకోవాలి.జీవితం అనేది దానంతట అది క్లిష్టమైనది కాదు, మన ఆలోచనలతోనే దానిని సంక్లిష్టం చేసుకుంటున్నాం. పిల్లల్లా ఆలోచించే మనసును మళ్లీ తెచ్చుకుంటే, ఆ స్వచ్ఛమైన, నిర్మలమైన సంతోషం ఎప్పుడూ మన వెంటే నడుస్తుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# తాడిచర్ల-2 కేటాయింపు కిషన్ రెడ్డి కృషి ఫలితమే

## యూపిఏ హయాంలో కేటాయింపు అవాస్తవం

## భట్టి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే పాయల శంకర్

తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌అన్నారు.యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాడిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలేకపోయిందని విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు



పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాల తో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

# ట్రంప్ మెడకు లైంగిక వేధింపుల కేసు

## దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు

## కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో న్యాయపరమైన ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధిపుల కేసులో ట్రంప్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు దోషిగా తేల్చింది. రచయిత్రి, మాజీ కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు రూ.47 కోట్లు చెల్లించాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. 2023లో విచారణ జరిపిన జ్యూరీ, ట్రంప్ లైంగిక దాడికి పాల్పడినట్లు, అనంతరం క్యారల్ పరువును దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినట్లు తేల్చింది. దీంతో 5 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని అప్పుడే తీర్పు వెలువరించింది. లైంగిక దాడికి గాను 2 మిలియన్ డాలర్లు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు గాను 3 మిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ మే 2023లో కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ట్రంప్ చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. 1996లో న్యూయార్క్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూమ్‌లో తనపై ట్రంప్ లైంగిక దాడి చేశారని క్యారల్ ఆరోపించారు. ఆ విషయాన్ని 2019లో ప్రచురితమైన ఓ పుస్తకంలో క్యారల్ రాశారు. ఆ ఆరోపణలు పూర్తిగా కల్పితమని, క్యారల్ ఒక పిచ్చిదని ట్రంప్ కొట్టిపడేశారు. కాగా, ఇది ట్రంప్‌నకు సంబంధించిన ఏకైక సివిల్ కేసు కాదు. 2024లో పరువు నష్టం కేసులో క్యారల్‌కు అదనంగా 83.3 మిలియన్ డాలర్లు చెల్లించాలని మరో జ్యూరీ తీర్పు ఇచ్చింది. ఆ కేసు కూడా ప్రస్తుతం న్యాయపరమైన ప్రక్రియలో కొనసాగుతోంది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 10-7-2026


# ఆదర్శ పాఠశాల,కళాశాలలో వంటశాలకు పక్క భవనం నిర్మించాలి

- పాఠశాల విద్యార్థులకు డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలి...
- ఆదర్శ పాఠశాలకు సరైన రోడ్డు మార్గం లేక విద్యార్థుల అవస్థలు...
- సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి పాషా
- సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్




**చౌటుప్పల్, జూలై 9, క్రైమ్ మిర్రర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే, నాణ్యమైన విద్యతోపాటు మౌలిక సదుపాయాలను కూడా కల్పించాలని గురువారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల,కళాశాలను సందర్శించి అక్కడ సమస్యలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండి పాష, గోశిక కరుణాకర్ లు మాట్లాడుతూ... ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వంటకానికి కావలసిన సరైన భవన సదుపాయం లేక, రేకుల షెడ్డులోనే మధ్యాహ్న భోజనాన్ని వండవలసిన దుస్థితి కలిగిందన్నారు. విద్యార్థులకు అందుతున్న వసతులను, విద్యను గురించి ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు.ఆదర్శ పాఠశాల, కళాశాలలను స్థాపించి సుమారు 14 సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు మధ్యాహ్నం భోజన వంటశాలకు పక్కా భవనం లేకపోవడం బాధాకరమన్నారు. దీనివలన వర్షాకాలంలో విద్యార్థులకు కావాల్సిన మధ్యాహ్న భోజన వంటకానికి తయారీదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అంతేకాకుండా పాఠశాలకు వచ్చిన విద్యార్థులు మధ్యాహ్నం భోజనాన్ని కూర్చొని తినడానికి సరైన వసతులు లేక నేలపై కూర్చుని తింటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్నం భోజన వసతికి కావలసిన భవన సదుపాయాన్ని, విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని కూర్చొని తినడానికి ఒక డైనింగ్ హాలును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు ఎండకు, వర్షాలకు ఇబ్బందికర పరిస్థితుల్లో భోజనం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత దృష్ట్యా పాఠశాలలో అత్యవసరంగా డైనింగ్ హాల్, వంటశాల గదిని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్య హక్కుతో పాటు విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వం బాధ్యతని తెలిపారు. ఆదర్శ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు తగిన మౌలిక వసతులు కూడా ఉండేలా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**అధ్వానంగా మోడల్ స్కూల్ కు వచ్చే దారి...**

మోడల్ స్కూల్ కు వచ్చేటటువంటి రోడ్డు గుంతల మయం అవ్వడం వల్ల విద్యార్థులు , తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలంలో మట్టి రోడ్డుపై నీళ్లు నిలిచి విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల మిషన్ భగీరథ పైపు లైన్ల కోసం రోడ్డును తవ్వటంతో రోడ్డు అంత గుంతల మయంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, బండారు నరసింహ, దండా అరుణ్ కుమార్, ఆకుల ధర్మయ్య, తూర్పునూరి మల్లేశం, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎం. డి. ఖయ్యూం, తూర్పునూరి వెంకటేష్, తూర్పునూరి సుమలత, గుణముని ఐలయ్య, పాల్గొన్నారు.



## శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో రూ.10 లక్షల నిధులతో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ ఘనంగా ప్రారంభించారు.

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** స్థానిక ప్రజల చిరకాల డిమాండ్ మేరకు ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, శంకర్‌పల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అందిస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తయిన తర్వాత మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు పారిశుద్ధ్యం మెరుగుపడి, ప్రజల ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చైర్మన్ తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు గణేష్, ఆనంద్, కో-ఆప్షన్ సభ్యుడు బాలకృష్ణ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, స్థానిక ప్రముఖులు పాల్గొని పనుల ప్రారంభాన్ని స్వాగతించారు. 9వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల స్థానికులు మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.



## భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరణ

**చౌటుప్పల్, జూలై 09(క్రైమ్ మిర్రర్ ):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం, లింగారెడ్డిగూడెం గ్రామంలో జి ఎన్ రెడ్డి గార్డెన్ లో కలకొండ సుధాకర్ - పూజ వివాహ వేడుకలో, మహనీయులు, ప్రపంచానికి జ్ఞానం అందించిన గౌతమ బుద్ధుడు, ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని, ఉప్పల పెల్లి బాలు, ఏర్పుల సురేష్, పాల్గొని వివాహ శుభాకాంక్షలు తెలియజేసి, మహనీయులు గౌతమ బుద్ధుడు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెల్లి అనేది రెండు మనసులు ఒప్పందం మాత్రమే అని, స్వర్గం, నరకం లో, ఎక్కడ రాసి ఉండదని వారు అన్నారు.

## గ్రామపంచాయతీలను అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు**




**యాదాద్రి జిల్లా,జూలై 9, క్రైమ్ మిర్రర్ :** గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమము జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఇట్టి అవగాహన కార్యక్రమానికి 10 మండలాలకు సంబంధించి ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట. బొమ్మలరామారం, తుర్కపల్లి, ఆత్మకూర్ (ఎం), మోటకొండూరు, గుండాల, అడ్డగూడూరు మరియు మోత్కూరు మండలాలకు చెందిన సర్పంచులు, పంచాయితి కార్యదర్శులు, అధికారుల కోసం జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, సరిత డిప్యూటీ కమిషనర్, జెడ్పీ సీఈఓ శోభా రాణి,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారులు , మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు,పిఆర్, ఆర్డబ్ల్యూఎస్ , ఏఈ లు, సంబంధిత గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాగా వారికి గ్రామ పంచాయతీల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల స్వంత ఆదాయ వనరుల పెంపు, 16వ ఆర్థిక సంఘం నిధుల సమర్థ వినియోగం, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, వి బి-+జీ రామ్ జి చట్టం 2025, జల్ సిరి, ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026 వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు.

## రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో మరో ఘనత

**తొలిసారిగా టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స విజయవంతం**



**రామకృష్ణాపూర్, జూలై 9( క్రైమ్ మిర్రర్) :** రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో తొలిసారిగా టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు.ఇటీవల టోటల్ నీ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను విజయవంతంగా చేపట్టిన ఆస్పత్రి వైద్య బృందం మరో అరుదైన శస్త్రచికిత్సను పూర్తి చేసి కొత్త మైలురాయిని చేరుకుంది.డిప్యూటీ సీఎంఓ డాక్టర్ మధుకుమార్ పర్యవేక్షణలో ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సుహాసిని, డాక్టర్ నరేష్, అనస్థీషియా నిపుణురాలు డాక్టర్ మైత్రి ఈ శస్త్రచికిత్సను నిర్వహించారు. ఆర్‌కేఎన్‌టీ గనికి చెందిన ఉద్యోగి ఐలయ్యకు ఈ శస్త్రచికిత్స చేయగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంఓ డాక్టర్ మధుకుమార్ మాట్లాడుతూ, రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో ఆధునిక వైద్య సేవలను నిరంతరం విస్తరిస్తూ ప్రజలకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, సీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్ సహకారంతో ఆస్పత్రి అభివృద్ధి చెందుతోందన్నారు.శస్త్రచికిత్సలో ఆపరేషన్ థియేటర్ ఇన్‌చార్జి జ్యోతి, థియేటర్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వనమహోత్సవం సందర్భంగా గీతాంజలి ది గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా మొక్కల నాటే కార్యక్రమం





**కొండాపూర్ క్రైమ్ మిర్రర్ :** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వనమహోత్సవం సందర్భంగా గీతాంజలి ది గ్లోబల్ స్కూల్, కొండాపూర్ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ ( టీ జీ ఎస్ పీ ) 8వ బెటాలియన్, కొండాపూర్ ప్రాంగణంలో ఘనంగా మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పోలీసు అధికారులు ఉత్సాహంగా పాల్గొని పలు రకాల మొక్కలను నాటారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంత ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 'టీ జీ ఎస్ పీ' 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం. రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. రాంబాబు, జే ఏ ( ఎస్సై ) సత్యనారాయణ, పి ఆర్ ఓ ( ఎస్సై ) ఎ. మహేందర్ రెడ్డి, గీతాంజలి ది గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ డీవీఎన్ రావు, ప్రిన్సిపాల్ అక్షిత అగ్నిహోత్రి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థుల్లో బాధ్యతాభావాన్ని పెంపొందించేలా విజయవంతంగా సాగింది.

## ఈనెల 13న కల్వకుర్తి ఐటిఐ లో అప్రెంటిస్ జాబ్ మేళా




**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** ఈనెల 13న సోమవారం రోజు కల్వకుర్తి ప్రభుత్వ ఐటిఐ లో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేలా (గ్రావీచీూవీ) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జయమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని, ఈ అప్రెంటిషిప్ జాబ్ మేలాలో పలు పేరు గాంచిన ప్రసిద్ధ కంపెనీల ప్రతినిధులు రాబోతున్నట్లు పేర్కొన్నారు. కావున అర్హులైన విద్యార్థి, విద్యార్థినులు తగు సర్టిఫికెట్ లతో సకాలంలో హాజరుకావాలని ప్రిన్సిపల్ సూచించారు. మరిన్ని వివరాల కోసం 8500461186, 8500461220 నంబర్లకు సంప్రదించాలని చెప్పారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను చైతన్యపరచాలి

**ప్రాజెక్టుల కాల్వల ద్వారా సాగునీటికి జిల్లాలో నీటి లభ్యత లేదని రైతులకు స్పష్టంగా వివరించాలి**

**మండలాల వారీగా పంటల మార్పు ప్రణాళికలు సిద్ధం చేయాలి..జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో, రైతులు నీటి ఆధారిత పంటల సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆయా శాఖలో ఉన్నతాధికారులతో కలిసి గురువారం హైదరాబాద్ సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యాన శాఖల అధికారులతో వానాకాలం పంటలు, వర్షాభావ పరిస్థితులు ప్రాజెక్టుల్లో నీటి నిలువలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశం అనంతరం జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన కలెక్టర్, జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యత, సాగు పురోగతి, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జూన్ 1 నుంచి జూలై 9 వరకు నాగర్ కర్నూల్ జిల్లాలో అత్యల్ప వర్షపాతం నమోదైందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టుల్లో తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితంగా నీటి నిల్వలు ఉన్నాయని, సాగునీటి అవసరాలకు విడుదల చేసేందుకు సరిపడా నీరు అందుబాటులో లేదని, ఈ పరిస్థితుల్లో కాల్వల ద్వారా సాగునీటి సరఫరా చేయడం సాధ్యం కాదని, ఈ వాస్తవాన్ని జిల్లా రైతులకు ఎలాంటి అపోహలు లేకుండా స్పష్టంగా తెలియజేయాలని వ్యవసాయ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

నీటిపారుదల శాఖ అందించే తాజా నివేదికల ఆధారంగా మండలాల వారీగా నీటి లభ్యతను అంచనా వేసి, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రతి మండలానికి అనువైన పంటల జాబితాను తెలుగులో రూపొందించి, రైతు వేదికల ద్వారా ప్రతి రైతుకు చేరేలా వాట్సాప్ ల ద్వారా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు వేదికలు, రైతు సంఘాల ద్వారా రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని, జిల్లాలో యూరియా కొరత లేదని , రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువుల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. యూరియా పంపిణీలో నిర్లక్ష్యం, జాప్యం చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.

నీటి కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జొన్న, సజ్జ, మొక్కజొన్న, కంది, మినుము వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటలతో పాటు కూరగాయలు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేయగల ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. ఏ మండలంలో ఏ పంట వేస్తే అధిక దిగుబడి, మెరుగైన ఆదాయం వస్తుందో శాస్త్రీయంగా విశ్లేషించి రైతులకు వివరించాలని, ఈ నెల 14వ తేదీలోగా మండలాల వారీ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.

ప్రాజెక్టుల్లో నీటి లభ్యతకు సంబంధించిన వివరాలను నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖకు అందించాలని, పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

అలాగే శుక్రవారం నిర్వహించనున్న జిల్లా కేంద్రంలో నిర్వహించే సర్పంచ్‌ల సమావేశంలో గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించే అంశంపై ప్రత్యేకంగా చర్చించి, ప్రతి గ్రామంలో రైతులకు సరైన సమాచారం చేరేలా సర్పంచ్‌లను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సాగు పురోగతిని వివరించారు. గత ఏడాది జూలై 9 నాటికి జిల్లాలో మొత్తం 2,35,629 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, ఈ ఏడాది అదే తేదీ నాటికి 2,22,822 ఎకరాల్లో సాగు నమోదైందన్నారు.

పత్తి సాగు గత ఏడాది జూలై 9వ తేదీ నాటికి 2,04,329 ఎకరాల్లో ఉండగా, ఈ ఏడాది జులై 9వ తేదీ నాటికి 2,07,089 ఎకరాలకు పెరిగిందని తెలిపారు. వరి సాగు గత ఏడాది జూలై 9వ తేదీ నాటికి కేవలం 265 ఎకరాల్లో ఉండగా, ఈసారి జులై 9వ తేదీ నాటికి 5,809 ఎకరాలకు చేరిందన్నారు. మొక్కజొన్న సాగు గత ఏడాది 27,314 ఎకరాల నుంచి ఈ ఏడాది 7,547 ఎకరాలకు తగ్గిందని చెప్పారు. జొన్న సాగు 2,075 ఎకరాల నుంచి 422 ఎకరాలకు తగ్గగా, కంది సాగు 1,520 ఎకరాల నుంచి 1,364 ఎకరాలకు తగ్గిందన్నారు. బ్లాక్‌గ్రామ్ (మినుము) సాగు మాత్రం గత ఏడాది 126 ఎకరాల నుంచి ఈ ఏడాది జులై 9వ తేదీ నాటికి 591 ఎకరాలకు పెరిగినట్లు వివరించారు. వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రతరం కాకముందే రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని కలెక్టర్ అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, ఎరువుల సరఫరా, ప్రత్యామ్నాయ పంటలపై మార్గదర్శకాలను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సంబంధిత శాఖలకు ఆదేశించారు.

నేటి నుంచి మీ సేవల ద్వారా యూరియా బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, మీ సేవ నిర్వాహకులకు 10 రూపాయలు మాత్రమే చెల్లించేలా రైతులకు తెలియజేయాలన్నారు. ఎవరైనా ఎక్కువ మొత్తంలో డబ్బులు రైతుల నుండి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశ్వం, డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేసు, నీటిపారుదల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవపూర్ మండలంలో గ్యాస్ మాఫియా..?

- డొమెస్టిక్ సిలిండర్‌కు రూ.1,080, వినియోగదారుల ఆవేదన
- కళ్లుమూసుకున్న సంబంధిత శాఖలపై ప్రజల అసంతృప్తి
- జిల్లా అధికారులు వెంటనే స్పందించాలని ప్రజల డిమాండ్

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలో డొమెస్టిక్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల విక్రయాల్లో భారీ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయించిన ధర కంటే అధికంగా ఒక్కో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌కు రూ. 1,080 వరకు వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ప్రభుత్వం సబ్సిడీతో అందించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌ను అధిక ధరకు విక్రయించడం వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లు ఇవ్వకుండా, "ఇంతే ధర" అంటూ వినియోగదారుల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో జరుగుతున్న ఈ అధిక ధరల వసూళ్ల వెనుక సంబంధిత శాఖ అధికారుల అండదండలు ఉన్నాయనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే అక్రమాలు కొనసాగుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. మహాదేవపూర్ మండలంలోని గ్యాస్ విక్రయాలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక విచారణ చేపట్టి, అధిక ధరలకు సిలిండర్లు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేదేమైనా ఉందా.. మాటలతోనే సరిపెడతారా?

**తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి .. రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక**

**హామీలు అమలు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం**

**జిల్లా అధ్యక్షులు గూడెపు నాగలింగం**



**హుజూర్ నగర్, జూలై 09(క్రైమ్ మిర్రర్ ):** రాష్ట్రంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదని అన్నారు. "రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేదేమైనా ఉందా.. లేక మాటలతోనే సరిపెడతారా?" అంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక. హుజూర్ నగర్ కేంద్రంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు గూడెపు నాగలింగం అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్యనాయకుల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, మట్టపల్లి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి టెంపుల్ రజక సత్రం చైర్మన్ పిల్లుట్ల కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు గూడెపు నాగలింగం మాట్లాడుతూ రజకుల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించి ఎస్సీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్రరాజు ఆంజనేయులు మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం రజక సమాజాన్ని ఉపయోగించుకోవడం మానేసి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోజిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లానపు సత్యనారాయణ, జిల్లా నాయకులు దుగ్గి వర్మ , హుజూర్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు తాతరాజు రామలింగం,చింతలపాలెం మండల ఉపాధ్యక్షులు పరిమ వీరయ్య,కీతవారి గూడెం గ్రామ వార్డు మెంబర్ గూడెపు వెంకటేష్,, హుజూర్ నగర్ ఇస్త్రీ షాపుల అధ్యక్షులు ఇందిరాల నర్సయ్య,యలమంద సుందరం వడ్లానపు శ్రీను,కుమర్ రాజు నాగయ్య,గూడెపు నాగరాజు,పాలెల్లి అంజయ్య ,పాలెల్లి వెంకటేష్,అలవాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సార్ ఫారాల నమోదు కోసం ఇంటింటికీ..ప్రజా సేవే లక్ష్యం..

**మండల మీడియా కన్వీనర్ శ్రీరాముల రవి**



**సంస్థాన్ నారాయణపూరశీ, జూలై 09(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూరశీ మండలం, వావిళ్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ , మండల మీడియా కన్వీనర్ శ్రీరాముల రవి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సార్ ఫామ్స్ స్వయంగా నింపి సర్వేపై అవగాహన కల్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమం గురించి ఓటర్లకు వివరించారు. అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా సార్ ఫారాలను నింపాలని సూచించారు. నింపిన ఫారాలను సంబంధిత బిఎల్ఓ లకు వెంటనే అందజేయాలని కోరారు. గడువు ముగిసేలోపు ఫారాలను సమర్పించి ఓటరు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు అవసరమైన సమాచారం అందించారు. ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని శ్రీరాముల రవి పేర్కొన్నారు.

# పెంచికల్ దిన్నె మత్స్య సొసైటీ అక్రమాలపై అధికారుల విచారణ

**సొసైటీ పై పలు సార్లు ఫిర్యాదు చేసిన ఆర్టీఐ సామాజిక కార్యకర్త సిరికొండ రామకృష్ణ**

**ఎట్టకేలకు స్పందించి విచారణ చేపట్టిన ఫిషరీస్ అభివృద్ధి అధికారులు**



**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల:** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం లోని పెంచికల్ దిన్నె గ్రామ చెరువు సొసైటీలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్న అవకతవకలు, అక్రమ సభ్యత్వాలు, మత్స్య సహకార సంఘం నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలపై గత మూడు సంవత్సరాల క్రితం నుంచి ఆర్టీఐ సామాజిక కార్యకర్త సిరికొండ రామకృష్ణ పలుమార్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ కి,తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త కి, సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఆ ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గురువారం ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వీసం మారయ్య పెంచికల్ దిన్నె గ్రామానికి చేరుకుని క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు.విచారణ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మత్స్య సహకార సంఘానికి చెందిన పాత సభ్యులు, కొత్త సభ్యులు, గ్రామస్థుల అభిప్రాయాలను అధికారి స్వయంగా నమోదు చేసుకున్నారు. అక్రమ సభ్యత్వాలు, సంఘ నిర్వహణలో జరిగిన అవకతవకలు, సభ్యులు లేవనెత్తిన ఇతర అంశాలపై వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మాట్లాడుతూ, విచారణలో సభ్యులు ప్రస్తావించిన అన్ని అంశాలను సమగ్ర నివేదిక రూపంలో జిల్లా అధికారులకు సమర్పిస్తామని, అనంతరం జిల్లా అధికారులు నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకుని చర్యలు చేపడతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెంచికల్ దిన్నె గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం పాత సభ్యులు, కొత్త సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యూరియా పంపిణీపై ప్రభుత్వ తీరుపై విమర్శలు

**కాంగ్రెస్ వైఫల్యమే రైతుల ఇబ్బందులకు కారణం: బీఆర్ఎస్ నేత బాపు నాయక్**




**చెన్నూర్, జూలై 9 (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో యూరియా పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రైతులను అయోమయానికి గురిచేస్తున్నాయని బీఆర్ఎస్ కోటపల్లి మండల సోషల్ మీడియా కన్వీనర్ బాపు నాయక్ విమర్శించారు. ఒక జిల్లాలో యాప్ ద్వారా యూరియా పంపిణీ చేస్తుండగా, మరో జిల్లాలో ఆ విధానం లేకపోవడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమన్నారు.రాష్ట్రంలో యూరియా కొరతను కప్పిపుచ్చేందుకే యాప్ విధానాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. రైతులందరికీ ఒకేసారి యూరియా అందించలేక జిల్లాకో నిబంధన, పూటకో ప్రకటన చేస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సకాలంలో ఎరువులు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.యాప్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం మానుకుని, రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన మేర యూరియాను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని బాపు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలి

## -రెవెన్యూ శాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్ కుమార్

## -వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి జిల్లా,జూలై 9, క్రైమ్ మిర్రర్ :** భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు.డీజీపీఎస్,రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు.రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.రీ సర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రీ సర్వే నాణ్యతతో నిర్వహించాలని, సర్వేలో ఉపయోగించే ఆధునిక పరికరాల వినియోగాన్ని సాంకేతికంగా పర్యవేక్షించే వ్యవస్థ అందుబాటులో ఉందని, వాటిని సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. రీ సర్వేలో పాల్గొనే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేస్తుందని తెలిపారు.భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో అసాధారణ జాప్యం పై ఉన్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సాధారణ విధులు నిర్వహించడానికి కోర్టు ఆదేశాలు అవసరమా అని హైకోర్టు ప్రశ్నించిందని తెలిపారు. ప్రస్తుతం ప్రతి అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై హైకోర్టు వివరణ కోరుతోందని, స్పందించేందుకు నాలుగు వారాల గడువు లభించిందన్నారు. రెవెన్యూ కార్యాలయంలోనూ భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, పెండింగ్ దరఖాస్తులను అత్యంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారి సుజాత,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చింతకానిలో భారీ రైతు ఆశీర్వాద సభ

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**3 లక్షల మంది రైతులు హాజరవుతారని అంచనా**

**సభకు ప్రతి రైతు హాజరై ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపు**

**9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ**

**వ్యవసాయ, అనుబంధ రంగాల కోసం 1,67,877 కోట్లు వ్యయం**

**రైతు భరోసా, ఆశీర్వాద సభ ఏర్పాట్లపై మీడియా సమావేశం నిర్వహించిన డిప్యూటీ సీఎం**




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** జూలై 10 న ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురం గ్రామం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. గురువారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో డిప్యూటీ సీఎం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి రైతు భరోసా ఆశీర్వాద సభపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా పెట్టుబడి సహాయాన్ని అందించిన నేపథ్యంలో జూలై 10న రైతు ఆశీర్వాద సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 3 లక్షల మంది రైతులు ఈ సభకు హాజరవుతారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రైతులే రాష్ట్రానికి వెన్నెముక అని రైతులకు ప్రతి అడుగులో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని చెప్పారు.గత ప్రభుత్వం రైతు భరోసా పథకం క్రింద పదేళ్లలో మొత్తం రూ.72 వేల కోట్లు మాత్రమే అందించిందని తమ ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా క్రింద రూ.35,830 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు.వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఒక లక్ష 67 వేల 877 కోట్లను వెచ్చించిందన్నారు. రైతు రుణమాఫీ ధాన్యానికి బోనస్ పంటల బీమా పంట నష్టపరిహారం ఉచిత విద్యుత్ విద్యుత్ సబ్సిడీ వ్యవసాయ యాంత్రీకరణ వంటి పలు రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఈ నిధులను వినియోగించినట్లు వివరించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నామని వెల్లడించారు.ఖమ్మం జిల్లా అంటేనే వ్యవసాయానికి ప్రతీక అని నాగార్జునసాగర్ వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతం వ్యవసాయాభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని భవిష్యత్తులో రైతులకు మరింత మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తామని రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయడంలో మీడియా ప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో మీడియా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయండి..

**సింగరేణి మండల అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామంలోని రైతు వేదిక లో అన్ని శాఖల అధికారులతో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా వారు అధికారులకు పలు సూచనలు చేశారు.. ఈనెల 10న చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డు జగన్నాథపురం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గోనున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరారు..వైరా నియోజకవర్గం నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు..సభకు వచ్చే రైతులకు ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని ఆదేశించారు..ప్రతి గ్రామం నుంచి రైతులు ఎంత మంది రైతులు హాజరవుతారు, వారిని ఏ మార్గంలో ప్రయాణిం చాలని అనే అంశాలను ముందుగానే ఖరారు చేయాల న్నారు..సభకు వచ్చే రైతులుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు..అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి న్నారు.




# వ్యక్తిగతంగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

**సొసైటీలతో న్యాయపరమైన చిక్కులు**

**సీఎంకు సూచిస్తానని ఉప ముఖ్యమంత్రి భట్టీ హామీ**

**టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ వినతిపై స్పందన**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ - హెచ్ - 2843) ఖమ్మం జిల్లా కమిటీ గురువారం చింతకాని మండలం లచ్చగూడెంలో సమర్పించిన వినతిపత్రంపై డిప్యూటీ సీఎం స్పందించారు. మండలంలోని జగన్నాథపురంలో శుక్రవారం జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి హాజరవుతున్న దృష్ట్యా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. దీనిపై స్పందించిన భట్టి... సొసైటీల ద్వారా అయితే న్యాయపరమైన చిక్కులు ఉంటాయి కాబట్టి, అవేవీ లేకుండా వ్యక్తిగతంగానో...బీపీఎల్ కోటాలోనో...మరో రకంగానో ఇచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల్లో చాలామంది పేదలు, మధ్యతరగతి వర్గానికి చెందినవారు, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, అద్దె ఇండ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో టీడబ్ల్యూజేఎఫ్ పేర్కొంది. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయమై అనేక పర్యాయాలు గత, ప్రస్తుత ప్రభుత్వంలో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో విజ్ఞప్తులు, పోరాటాలు నిర్వహించామని ఫెడరేషన్ నేతలు తెలిపారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం వెలుగుమట్ల, వీవీ పాలెం రెవెన్యూలో 23 ఎకరాలకు పైగా కేటాయిస్తూ జీవో ఇచ్చిందని, కానీ అది కార్యరూపం దాల్చలేదని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దీనిపై కొంత సందిగ్ధత ఏర్పడిందని న్యాయపరమైన చిక్కులు లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేసే విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ప్రకటనలు చేసి ఉన్నారని ప్రస్తావించారు. సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇండ్ల స్థలాలు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ విషయంలో నాన్చివేత ధోరణి విడనాడాలని కోరారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని తమరి నియోజకవర్గానికి విచ్చేస్తున్న దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ప్రాతిపదికన, ఎప్పటి లోగా ఇండ్ల స్థలాలు ఇస్తారో...! నిర్దిష్టమైన తేదీతో సహా వెల్లడించేలా స్పష్టమైన ప్రకటన చేయించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, జిల్లా కమిటీ సభ్యులు రాంపుడి నాగేశ్వరరావు, కొత్త యాకేష్, మంకెన నాగేశ్వరరావు, నూకల రామచంద్రమూర్తి, కొమెర నాగేశ్వరరావు, ఖమ్మం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు తురగ రాఘవేంద్రమూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలుబోల మధుశ్రీ, టీబీజేఏ కెమెరామన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, గణేష్, అర్షద్, శరత్, నాయకులు సీహెచ్ ప్రసాద్, సురేందర్, గడ్డం విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆలేరు నియోజకవర్గ పిఎసీఎస్ నూతన పాలకమండలి నియామకం

**రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కృతజ్ఞతలు..**

**ఆత్మకూరు(ఎం),జూలై09/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పిఎసీఎస్)నూతన పాలక మండళ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రైతు సంక్షేమం, సహకార వ్యవస్థ బలోపేతం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ఈ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నూతనంగా నియమితులైన చైర్మన్లు:(1)బొమ్మలరామారం మండలం -- సింగిర్తి మల్లేశం.(2)తుర్కపల్లి మండలం -- ధనావత్ శంకర్ నాయక్.(3)యాదగిరిగుట్ట మండలం -- చీర శ్రీశైలం.(4)రాజపేట మండలం --నమిల మహేందర్.(5)ఆలేరు మండలం -- జనగాం ఉపేందర్ రెడ్డి.(6)ఆత్మకూరు (ఎం)మండలం -- యాస లక్ష్మారెడ్డి.(7)గుండాల మండలం -- అందెం సంజీవరెడ్డి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టిందన్నారు.ఈ నియామకాలకు ఆమోదం తెలిపిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, సహకార శాఖ మంత్రికి,రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే నూతనంగా నియమితులైన చైర్మన్లు, డైరెక్టర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు, ఇతర సహకార సేవలను పారదర్శకంగా అందించి సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న పిఎసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లందరికీ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి పదవీకాలంలో రైతులకు విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యమా?

**ఆత్మకూరు(ఎం),జూలై09/క్రైమ్ మిర్రర్:**టరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ ఐ ఆర్)ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ కార్యక్రమం యాదాద్రి భువనగిరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందికరంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీలో కొందరు బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓలు)నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్యూమరేషన్ ఫారాల్లో బీఎల్‌ఓల ఫోన్ నెంబర్లు ముద్రించినప్పటికీ కొన్ని ఫోన్ నెంబర్లు పని చేయటం లేదని ఓటర్లు ఆరోపిస్తున్నారు. దీంతో ఫారాలకు సంబంధించిన సందేహాలు నివృత్తి చేసుకోవడం. అవసరమైన సమాచారం పొందడం కష్టంగా మారుతోందని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్ళి ఎన్యూమరేషన్ ఫారాలను అందచేసి,వివరాలు సేకరించాల్సి ఉండగా కొందరు మాత్రం కమ్యూనిటీ హాళ్లు,గ్రామ పంచాయతీ కార్యాలయంల్లో లేదా ఒకేచోట కూర్చొని ప్రజలే వచ్చి ఫారాలు తీసుకోవాలని సూచిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఆలేరు నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈనెల24వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో5 50శాతం వరకు ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదనే ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, బీఎల్‌ఓలు నిబంధనల ప్రకారం ఇంటింటికి వెళ్లి విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే బీఎల్‌ఓల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని, ఎన్యూమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్ధవంతంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆదర్శ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



గండిపేట(క్రైమ్ మిర్రర్): మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీలో గల ఆదర్శ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం(లిమిటెడ్) కార్వాన్--హైదరాబాద్ నూతన పాలకవర్గ ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఎన్నికల అధికారి హరి శంకరన్ పర్యవేక్షనలో సభ్యులందరి ఆమోదంతో ఈ ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది. సంఘం అధ్యక్షులుగా పున్న కష్ణయ్య, ఉపాధ్యక్షునిగా పున్న నరేష్, కార్యదర్శిగా దోర్నాల పావని, కోశాధికారిగా ఏదిరే వెంకటేష్, పాలకవర్గం సభ్యులుగా పోగుల నరేష్, భూపతి కష్ణ, కార్డస్ రమేష్, మాసిన వనజ, గుజ్జరీ బాలమణిలు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పున్న కష్ణయ్య మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘం సభ్యులందరికీ ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, సంఘం ఆర్థిక బలోపేతం, ఉత్పత్తులకు మార్కెట్‌లో మెరుగైన అవకాశాలు కల్పించడం, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం నూతన పాలకవర్గం సమిష్టిగా కషి చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి చేనేత కార్మికుడికి చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, సంఘాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు సభ్యులందరి సహకారం అవసరమని ఆయన కోరారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను సంఘం సభ్యులు, స్థానిక ప్రముఖులు ఘనంగా అభినందించి, శుభాకాంక్షలు తె లియజేశారు.

# ఆకస్మిక తనిఖీల్లో వెలుగుచూసిన అవకతవకలు..!!

## స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, లైసెన్సులపై క్షుణ్ణంగా పరిశీలన

## ఎరువుల కొరత, కృత్రిమ నిల్వలు, అధిక ధరలపై ప్రత్యేక దృష్టి

## నిబంధనలు పాటించని వారిపై చర్యలు కొనసాగుతాయని అధికారుల హెచ్చరిక



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పలు లోపాలు వెలుగులోకి వచ్చాయి. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుతున్నాయా? ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలు అమలవుతున్నాయా? అనే అంశాలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ పాల్ ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి శ్రీజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, విక్రయాల బిల్లులు, లైసెన్సులు, నిల్వలు, విక్రయ విధానం, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైతులకు విక్రయించే ప్రతి ఎరువుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. తనిఖీల సందర్భంగా కొన్ని దుకాణాల్లో స్టాక్ రికార్డుల్లో వ్యత్యాసాలు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, బిల్లుల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యాపారులకు సూచనలు జారీ చేయడంతో పాటు, భవిష్యత్తులో నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దు వరకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో కూడా మాట్లాడి, ఎవరైనా ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, బిల్లు ఇవ్వకుండా విక్రయించినా, అనవసరంగా ఇతర ఉత్పత్తులను బలవంతంగా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేసినా వెంటనే వ్యవసాయ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, బిల్లు ఉంటేనే ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం సులభమవుతుందని తెలిపారు. మరోవైపు రైతులు మాత్రం తనిఖీలను స్వాగతిస్తున్నప్పటికీ, కేవలం తనిఖీలతోనే సరిపెట్టకుండా నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గతంలో కూడా ఇలాంటి తనిఖీలు జరిగినప్పటికీ కొంతమంది వ్యాపారుల తీరులో పెద్దగా మార్పు కనిపించలేదని రైతులు అంటున్నారు. అధిక ధరలకు విక్రయాలు, బిల్లులు ఇవ్వకపోవడం, కొరత పేరుతో ఇబ్బందులకు గురిచేయడం వంటి అంశాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎరువుల సరఫరా వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలో తనిఖీలు కొనసాగుతాయని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించే వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, రైతులను మోసం చేసే వారిపై మాత్రం చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఖమ్మం నడిబొడ్డున కాల్వలు ఆక్రమణలు - వై విక్రమ్

**ఇలా ఆక్రమణలతోనే కవిరాజు నగర్ కు వరద పోటు...గతంలో నిబంధనలకు విరుద్ధం అని ఆనాడు అదే స్థలంలో ఐస్ ఫ్యాక్టరీ కుల్చువేత...**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం నడిబొడ్డున జిల్లా కోర్టు కు అతి సమీపంలో వైరా రోడ్ పక్కనే (నాగార్జున పంక్షన్ హాల్ సమీపంలో) ప్రధానమైన వరద కాల్వ ను కొద్దిమంది కబ్జాదారుల పూడ్చి వెయ్యి గజాల స్థలాన్ని చదును చేస్తున్నారు, వెంటనే అధికారులు వారి ఆగడాలకు అడ్డుకట్టు వేయాలని సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కాల్వ కబ్జా పనులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వై విక్రమ్ మాట్లాడుతూ 66 అడుగులతో పైన బైపాస్ రోడ్ నుండి ప్రధానమైన వరద కాల్వ వుంది అని, కాల్వ నుంచి 33 అడుగుల బఫర్ జోన్ వుంది అని కానీ కబ్జాదారులు ఏకంగా కాల్వలోకి మట్టి పోసి వైరా రోడ్ కు అనుకోని వున్న కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమిని దాదాపు వెయ్యి గజాల స్థలాన్ని చదును చేసారు అని ఆరోపించారు. గతంలో వరదలు వచ్చినప్పుడు ఇదే స్థలంలో వున్న ఐస్ ఫ్యాక్టరీ ను అధికారులు కూల్చారు అని తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం ఈ ప్రధానమైన కాల్వను పలువురు ఆక్రమించి అక్రమ బిల్డింగ్ లు కట్టడం ఫలితంగా వరదలు వచ్చినప్పుడు ఈ ప్రాంతంలో ఉన్న కవిరాజు నగర్ అంతా మునిగిపోయింది అని ఆరోపించారు. తిరిగి ఇక్కడ స్థలంలో కబ్జాదారుల ఆక్రమణలు చేస్తుంటే అధికారులు మౌనంగా ఉండటం ఏమిటి అని ప్రశ్నించారు. తిరిగి వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో కాల్వ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా కబ్జాదారుల పై కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ స్థలం ఆక్రమణలపై కమిషనర్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. లేని యెడల అదే స్థలంలో ఆందోళనకు దిగుతామని అని వై విక్రమ్ హెచ్చరించారు.

## "సర్" ప్రక్రియలో భాగస్వాములుకండి



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ --2026 కార్యక్రమం నేపథ్యంలో బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులతో బడంగ్పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఓటర్లకు వారి పోలింగ్ బూతుల వారీగా హెల్ప్‌డెస్క్ కేంద్రాలు ఏర్పాటు చేసి తద్వారా వారి యొక్క ఎన్యూమరేషన్ ఫారాల పూరణ, సందేహాల నివృత్తి చేసే ఏర్పాటు చేశామని అలాగే ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారంతో పాటు ఒక కలర్ పాస్ ఫోటో తీసుకుని వస్తే తగిన వివరాలు తెలిపి అక్కడే ఫారం పూరించి సమర్పించవచ్చని, ఈ కేంద్రాల వద్ద అధికారులు, సర్కిల్ సిబ్బంది, వాలంటీర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ూ×=--2026 ప్రాముఖ్యతను విస్తృతంగా వివరించి, అర్హత కలిగిన ప్రతి ఓటరు ఎన్యుమరేషన్ ఫారాన్ని సకాలంలో పూరించి సమర్పించేలా చైతన్యం కల్పించాలని కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్ఐఆర్--2026 అమలుకు సంబంధించిన పలు సందేహాలు, సూచనలు, అభిప్రాయాలను వ్యక్తం చేయగా, డిప్యూటీ కమిషనర్ వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఎన్నికల సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు, రాజకీయ పార్టీలు మరియు ప్రజలు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంబంధిత ఎన్నికల అధికారులు, సర్కిల్ అధికారులు మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.




## పాలేరు నియోజకవర్గంలో యస్ఐఆర్ అవగాహన కార్యక్రమం

**పాలేరు నియోజకవర్గం ఇంచార్జ్ నకరికంటి వీరభద్రం ..మండల అధ్యక్షుడు పాగర్తి**

**క్రైమ్ మిర్రర్ పాలేరు:** భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం లో బీజేపీ సీనియర్ నాయకులు బవనాసి దుర్గారావు గారి ఇంట్లో సర్ పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ నకిరికంటి వీరభద్రం అధ్యక్షతన మండల నాయకులు, శక్తికేంద్ర ఇంచార్జ్ లకు పాలేరు నియోజకవర్గ సర్ కార్యశాల జరిగింది, ఈ కార్యశాల ముఖ్య అతిధిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు గారు పాల్గొన్నారు ఈ సందర్బంగా నంబూరి రామలింగేశ్వరరావు గారు మాట్లాడుతూ సర్ పై బూత్ స్థాయిలో ప్రతి బీజేపీ కార్యకర్త అవగాహనా ఉండేటట్లు ప్రతి నాయకుడు బాధ్యత తీసుకోవాలని కోరారు, అంతేకాక ప్రతిపక్షాలు కెంద్ర ప్రభుత్వం ఓట్లు తొలిగిస్తుందని చేస్తున్న విష ప్రచారాలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు, వాస్తవానికి సర్ అనేది ప్రతీ 12 సంవత్సరాల ఒకసారి ఎలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో నడిచే ప్రక్రియ అని, గతంలో 2002 లో యస్ఐఆర్ ప్రక్రియ జరిగింది అని దాని తర్వాత నడుస్తున్న ఓటు ప్రక్షాళన జరుగుతుంది ఈ నెల 24 వ తారీకు వరకు సర్ ప్రక్రియ నడుస్తుందని అన్నారు,బూత్ స్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్ లు అధికారుల తో సమన్వయము చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో యస్ఐఆర్ జిల్లా కన్వీనర్ శ్యామ్ రాథోడ్ జిల్లా కోశాధికారి కొన్నతం లక్ష్మీనారాయణ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ రూరల్ మండల అధ్యక్షుడు జాటోత్ మధు పాలేర్ టోలి అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్ రెడ్డి రాష్ట్ర నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు సర్ మండల కన్వీనర్లు మల్లెబోయిన గోవిందరావు నల్లమాస శ్రీనివాస్ లంకపల్లి సాగర్ శంకర్ నల్లగట్టు శ్రీనివాస్ మహేందర్ నరేష్ ఉపేందర్ హీరా లాల్ నేలకొండపల్లి మండల ప్రధాన కార్యదర్శి బాజా రామకృష్ణ ఉపాధ్యక్షులు పురాణం దివాకర్ కొండా హర్షవర్ధన్, మండల నాయకులు సయ్యద్ మోహినూద్దీన్ పుట్టా సత్యనారాయణ గెల్లా చక్రపాణి కందరబోయిన గోపి జెల్లా సురేష్ పోతనబోయిన శేషగిరి లింగనబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు





## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్

**ఆత్మకూరు(ఎం),జూలై09/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం చిన్నలక్ష్మపూర్ గ్రామ వాస్తవ్యులు రచన రెడ్డి - శ్రీకాంత్ రెడ్డిల వివాహనికి సర్పంచ్ గ్రామపెద్దలతో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్య గౌడ్.

## టేకులసోమారం ఆరూరు గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సు





**ఆత్మకూరు(ఎం),జూలై09/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షుడు ఏ జయరాజు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వీ మాధవి లత సూచనల మేరకు వలిగొండ మండలం టేకుల సోమారం, ఆరూరు గ్రామాల్లో గ్రామ పంచాయతీల దగ్గర న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన సదస్సులో చీఫ్ డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ కట్ట భూపాల్ రెడ్డి, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ నారగోని రాజశేఖర్ పాల్గొన్నారు. టేకులసోమారం గ్రామ పంచాయతీ దగ్గర నిర్వహించిన సదస్సులో గ్రామ సర్పంచ్ పనుమటి మమతారెడ్డి, అరూరు గ్రామంలో సర్పంచ్ సుక్క ముత్యాలు అధ్యక్షతన ప్రజలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. వయోవృద్ధుల సంక్షేమ చట్టం,బాల్యవివాల నిర్మూలన చట్టం, మాదకద్రవ్యాలు నిరోధక చట్టం, జాతీయ న్యాయ న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అందజేస్తున్న వివిధ న్యాయ సేవల పథకాల గురించి వివరించడం జరిగింది. నల్సా ఆధ్వర్యంలో అందజేస్తున్న ఉచిత న్యాయ సేవలు గురించి 15100 టోల్ ఫ్రీ నెంబర్ గురించి తెలియజేశారు. రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక విధులు ఉంటాయని ప్రతి పౌరులు బాధ్యతగా తమ విధులను పాటించాలని సూచించారు. అవగాహన కరపత్రాలను ఆవిష్కరించి అందజేయడం జరిగింది. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు కురిమేటి యాదయ్య, కానుగంటి శ్రీశైలం,ఆయా గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్లు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల రైల్వే స్టేషన్ పక్కన ఒక గుర్తు తెలియని మగ శవం ఉన్నట్లు సమాచారం రాగా సంఘటన స్థలాన్ని సందర్శించి మృతుని శవాన్ని పరిశీలించి చూడగా సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు ఉండి తెలుపు మరియు నలుపు రంగుల కలయికతో ఉన్న చెక్స్ షర్ట్ ,బ్లూ కలర్ పాయింట్ బ్లాక్ కలర్ డిసార్ డ్రాయర్, ఎరుపు రంగు మొలధారం మరియు మృతుడి కుడి చేతి మీద అశోక చక్రం ఒక చేతి ముద్ర గల పచ్చబొట్టు కుడి చేతి పిడికిలి పై ఒక పచ్చబొట్టు కలవు .మృతుడు పిడ్స్ ల వల్ల గాని మరేఇతర ఆరోగ్య సమస్యల వల్ల గాని చనిపోయి ఉండవచ్చు మృతుని వివరాలు తెలిసిన వ్యక్తులు కింది ఫోన్ నెంబర్స్ కు సమాచారం తెలుపగలరు ఎస్సై-చిట్యాల:8712670187సి ఐ. నార్కట్పల్లి 8712670148.



# రాజేంద్రనగర్‌లో రాజకీయం సెగలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రకాష్ గౌడ్ గారిపై బీఆర్ఎస్ నేత సదాల వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు గానూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చెరుకుపల్లి రణధీర్ రెడ్డి పిడుగుల్లాంటి హెచ్చరికలతో విరుచుకుపడ్డారు. నిన్న మొన్న రాజకీయాల్లోకి వచ్చిన వెంకట్ రెడ్డికి, ఎమ్మెల్యేను ప్రశ్నించే అంత స్థాయి ఉందా అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం రణధీర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సదాల వెంకట్ రెడ్డిపై తీవ్రమైన పదజాలంతో విమర్శలు గుప్పించారు. నిన్న మొన్న రాజకీయాల్లోకి వచ్చి స్టేటస్ చెక్ చేసుకోకుండా మాట్లాడుతున్నావు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి నిరంతరం ప్రజాసేవలో ఉన్న ప్రకాష్ గౌడ్ ని విమర్శించే అర్హత నీకు ఎక్కడిది? నీ చరిత్ర ఏంటో, నీ బతుకేంటో రాజేంద్రనగర్ ప్రజలందరికీ బాగా తెలుసు నోరు అదుపులో పెట్టుకోకపోతే ఊరుకునేది లేదు అని హెచ్చరించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై మాట్లాడే దమ్ము లేకనే చేతకాని వాడిలా సదాల వెంకట్ రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని రణధీర్ రెడ్డి మండిపడ్డారు. నువ్వు చేస్తున్న వెకిలి వ్యాఖ్యలను, ఆధారాలు లేని చౌకబారు ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకోవాలి. లేదంటే కాంగ్రెస్ కార్యకర్తలు నీ తోక కత్తిరించడం ఖాయం. గత ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినా మీకు బుద్ధి రాలేదు. ప్రజల తీర్పును గౌరవించడం చేతకాకపోతే ఇంట్లో కూర్చోవాలి గానీ, ఇలాంటి పిచ్చి కూతలు కూస్తే సహించే ప్రసక్తే లేదు" అని నిప్పులు చెరిగారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నిబద్ధతను కొనియాడుతూ.. ఆయన పదవుల కోసమో, స్వార్థం కోసమో పార్టీలు మారలేదని రణధీర్ రెడ్డి స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఆయన కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఆయన నిరంతరం శ్రమిస్తుంటే.. వెంకట్ రెడ్డి మాత్రం ఎవరో వెనుక ఉండి ఆడిస్తున్న పప్పెట్ (కీలుబొమ్మ) లాగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వెంకట్ రెడ్డి వెనుక ఉండి నడిపిస్తున్న బాస్‌ల ఆటలు రాజేంద్రనగర్‌లో సాగవని తేల్చిచెప్పారు. రాజకీయాల్లో కనీస సంస్కారం, పరస్పర గౌరవం ఉండాలని రణధీర్ రెడ్డి హితవు పలికారు. ఒక ఎమ్మెల్యేపై బాధ్యతారాహిత్యంగా చేసిన వ్యాఖ్యలకు గానూ సదాల వెంకట్ రెడ్డి బహిరంగంగా ముక్కు నేలకు రాసి, రాజేంద్రనగర్ ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

## గౌతమ్ స్కూల్‌లో డిజిటల్ తరగతులను ప్రారంభించిన ఎస్ఐ శ్రీనివాసరెడ్డి





**క్రైమ్ మిర్రర్ పాలేరు నేలకొండపల్లి, జూలై 09:** నేలకొండపల్లి మండల కేంద్రంలోని గౌతమ్ హైస్కూల్‌లో గురువారం డిజిటల్ క్లాస్ రూమ్‌లను స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. దృశ్య, శ్రవణ మాధ్యమాల (డిజిటల్ క్లాసెస్) ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని, సాంకేతికతను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు ఎస్ఐ చేతుల మీదుగా ట్యాబ్‌లను అందజేశారు. డిజిటల్ తరగతుల ప్రారంభం అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సదస్సులో ఎస్ఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని వాటిని తప్పనిసరిగా పాటించాలని కోరారు. అలాగే గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలను వాటికి దూరంగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. యువత మత్తు పదార్థాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

**ఈ సందర్భంగా గౌతమ్**

స్కూల్ యాజమాన్యం ఎస్ఐ శ్రీనివాసరెడ్డి ని శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ కనపర్తి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ కనపర్తి నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ చక్రధర్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## డివిజన్–119 లో ప్రజా సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ అధికారులకు బీఆర్ఎస్ వినతిపత్రం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని కొత్వాలగూడ డివిజన్–119 లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ పౌర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధికారులను ఆశ్రయించారు. గురువారం డివిజన్–119 బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకుల బృందం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లను కలిసి సమస్యలపై ఒక సమగ్ర వినతిపత్రాన్ని అందజేసింది. ఆర్‌బీ నగర్, మధురా నగర్, సిద్ధాంతి ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారైందని అధికారుల దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా రాళ్లగూడ ప్రధాన రోడ్డుపై నిరంతరం డ్రైనేజీ నీరు పొంగిపొర్లడం వల్ల ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కొత్వాలగూడ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారిందని, తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. మధురా నగర్, ఆర్‌బీ నగర్, రాయల్ విల్లాస్, నక్షత్ర కాలనీ, తొండుపల్లి, ఉటుపల్లి, సిద్ధాంతి ప్రాంతాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఆదర్శ్ నగర్, బాలాజీ వెంచర్, ఎయిర్‌పోర్ట్ కాలనీ, న్యూ హుడా కాలనీ, ఆర్‌బీ నగర్, రాళ్లగూడ, మధురా నగర్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సరఫరాను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫిరంగి నాలాలో మురుగు నీరు నిలిచిపోవడం వల్ల ఆ ప్రాంతంలో విపరీతమైన దుర్వాసన వస్తోందని, దీనివల్ల దోమల బెడద పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల నుండి వినతిపత్రాన్ని స్వీకరించిన జోనల్ కమిషనర్ స్థానిక సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో త్వరలోనే ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అత్యవసర ప్రాధాన్యత ప్రాతిపదికన డివిజన్–119 లోని అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారుల బృందం భరోసా ఇచ్చింది. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ కొనమొల్ల శ్రీనివాస్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ 118 & 119 డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ, ముఖ్య నాయకులు ప్రదీప్ రెడ్డి, బుచ్చి రెడ్డి, రాజేందర్, చిలకమర్రి పరంధాములు, మురళి గౌడ్, చరణ్, జి.వి. పవిత్ర సాగర్, రమేష్ రాచమల్ల, రమేష్ రాథోడ్, దీపక్ గౌడ్, కార్తీక్ రాచమల్ల, అరవింద్, సాయి, బాలు, ఇతర సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్‌లో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ శిక్షణ ప్రారంభం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి విద్యాశాఖ రూపొందించిన వర్క్‌బుక్స్, ల్యాబ్ మాన్యువల్స్‌ను లక్ష్యాత్మకంగా వినియోగించాలని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా మండలి డైరెక్టర్ జి. రమేష్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని టీజీసీఏబీ వేదికగా గురువారం ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ క్వాలిటీ లెర్నింగ్ రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రతిష్టాత్మక శిక్షణా కార్యక్రమానికి రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 144 మంది జిల్లా రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ జి. రమేష్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని రిసోర్స్ పర్సన్లకు సూచించారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలను జిల్లా స్థాయి శిక్షణల్లో ఉపాధ్యాయులతో సమగ్రంగా చర్చించి, అవి తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన వర్క్‌బుక్స్, ల్యాబ్ మాన్యువల్స్, మరియు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు తదితర నూతన అంశాలపై ఉపాధ్యాయులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులందరూ నిర్దేశిత అభ్యసన ఫలితాలను సాధించేలా కృషి చేయడంతో పాటు, వారిలో కనీస సామర్థ్యాల పెంపుదల కోసం అమలవుతున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ ను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా పాఠశాలల పరిధిలో నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, ఉపాధ్యాయులు తమ వినూత్న బోధనా వ్యూహాలను ఒకరితో ఒకరు పంచుకోవడం ద్వారా విద్యార్థుల అభ్యసన ఫలితాలను వేగంగా మెరుగుపరచవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉన్నత స్థాయి శిక్షణా కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ ఫాకల్టీ సభ్యులు ఈ. డి. మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్, వివిధ జిల్లాల నుండి వచ్చిన రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## నార్సింగి సర్కిల్-45 నివాసితులకు అప్రమత్తత ఉత్తర్వులు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో నార్సింగి సర్కిల్–45 ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు తమ దైనందిన అలవాట్లను మార్చుకోవాలని, తద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తపడాలని ఆయన సూచించారు. సర్కిల్ పరిధిలోని నివాసితుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని కోరుతున్నారు. వాతావరణం చల్లబడినందున ఇళ్లలో ఏసీలు, కూలర్ల వాడకాన్ని పూర్తిగా ఆపాలని లేదా వాటి ఉష్ణోగ్రతను పెంచుకోవాలని సూచించారు. జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యల నుండి ఉపశమనం పొందేందుకు రోజుకు కనీసం ఒక్కసారైనా గోరువెచ్చని నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి. వాతావరణ మార్పుల వల్ల వచ్చే సాధారణ జలుబు, దగ్గును నివారించడానికి ఇంట్లో లభించే సహజ సిద్ధమైన మూలికలను ఉపయోగించడం మంచిది. దోమల ద్వారా సంక్రమించే డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులను అరికట్టడానికి ఇళ్ల పరిసరాల్లో ఎక్కడా నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం కూలర్ల అవసరం లేనందున, వాటిలో ఉన్న నీటిని వెంటనే ఖాళీ చేసి ఎండబెట్టాలి. వారానికి ఒకసారి ఇళ్లలోని ప్రతి పాత్ర, డ్రమ్ము లేదా ట్యాంకులలోని నీటిని ఖాళీ చేసి శుభ్రం చేయడానికి ప్రతి శుక్రవారాన్ని పొడి దినంగా పాటించాలని పిలుపునిచ్చారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులపై పోరాడేందుకు మరియు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి వీలుగా.. ప్రజలు 3 నుండి 5 రోజుల పాటు అడ్డసారం ఆకు లేదా నీలవేము ఆకులను ఆహారంలో భాగంగా తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి తమ ప్రకటనలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. ప్రజలందరూ భాగస్వాములై నార్సింగి సర్కిల్‌ను ఆరోగ్యకరమైన జోన్‌గా మార్చాలని ఆయన కోరారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 10-7-2026




## రాజేంద్రనగర్‌లో శ్రీ మాతా పోచమ్మ దేవాలయ 19వ వార్షికోత్సవం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ పరిధిలోని శ్రీ మాతా పోచమ్మ దేవాలయం యొక్క 19వ వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా అమ్మవారి వార్షికోత్సవ వేడుకలను స్థానికులు, ఆలయ కమిటీ వారు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం పూట అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష అభిషేక కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ భారీగా మహాప్రసాద వితరణ (అన్నదానం) కార్యక్రమం చేపట్టారు. రాత్రి వేళల్లో నిర్వహించిన భజన కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో అమ్మవారి కీర్తనలు ఆలపించారు. ఈ ప్రత్యేక ఉత్సవ కార్యక్రమాలలో భారతీయ జనతా పార్టీ గోల్కొండ ఇంచార్జ్ శ్రీధర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ తో పాటు స్థానిక ప్రముఖ నాయకులు ఎం. రాంబాబు, యాదమ్మ యాదవ్, ఉమామహేశ్వరి, ఆండాలు, కమల, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయ నిర్మాణ భూమి పూజ

**- ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్‌లోని నర్సింగి రోడ్‌లో నూతనంగా నిర్మించతలపెట్టిన లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ నిర్మాణానికి అత్యంత భక్తిశ్రద్ధలతో భూమి పూజ (శంకుస్థాపన) మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా భూమి పూజ నిర్వహించారు. స్వామివారి నూతన ఆలయ నిర్మాణంతో ఈ ప్రాంతంలో మరింత ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియనుందని, ప్రజలందరిపై ఆ లక్ష్మీ నరసింహ స్వామి వారి కరుణాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ పుణ్యకార్యంలో గణేష్ గుప్తా, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులతో పాటు భక్తజనం పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## బాలానగర్ డివిజన్‌లో ఉచిత కుట్టు మెషిన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

**బాలానగర్, జూలై 09 (క్రైమ్ మిర్రర్) :** మహిళలు ఆర్థిక రంగంలో ఎదగాలంటే స్వయం ఉపాధిని ఎంచుకోవాలని బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తమ సొంత నిధులతో ఆడపడుచుల స్వయం ఉపాధి కోసం రాజు కాలనీలోని గాంధీబొమ్మ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత కుట్టు మెషిన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, అక్కడ కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వారికి అందుతున్న శిక్షణ వివరాలను తెలుసుకుని, నిర్వాహకులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ శిక్షణను పూర్తిచేసిన ప్రతి మహిళకు సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా కుట్టు మెషిన్ అందజేయడం జరుగుతుందని, అలాగే వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూడా ప్రత్యేకంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణను పూర్తిగా నేర్చుకొని, ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళల సాధికారత, ఉపాధి కల్పనే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



## పాపిరెడ్డి నగర్ వీరాంజనేయ శివాలయ ఆలయంలో శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి, జూలై 09 (క్రైమ్ మిర్రర్) :** వేంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీ లో జరిగిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ చాముండేశ్వరీ అనుగ్రహ పీఠాధిపతులు శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి జన్మదిన వేడుకల లో ముఖ్యఅతిథిగా పి ఎస్ సి చైర్మన్ అరికెపూడి గాంధీ స్థానిక నాయకులతో పాల్గొని 200 మంది మహిళ సోదరీమణులకు చీరలను, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పి ఎస్ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ చాముండేశ్వరీ అనుగ్రహ పీఠాధిపతులు శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి కి జన్మదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, ఆయన జన్మదినం పురస్కరించుకొని పలు రాష్ట్రాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తన వంతు సేవలు అందించాలని, ఆ యొక్క సేవలో ప్రతిఫలం వచ్చే తరానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియచేశారు. ప్రస్తుత సమాజంలో సేవా కార్యక్రమాలకు ఎన్నో ధార్మిక సంఘాలు సహకారం అంది స్తున్నారు. అటువంటి ధార్మిక కార్యక్రమాలను ఎన్నో సంవత్సరాలుగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీశ్రీ శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి సేవలందిస్తున్నారని వారి సేవలను భావితరాలను దృష్టిలో ఉంచుకుని వారి మార్గంలో యువత సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని అయన పిలుపునిచ్చారు. బాలానగర్ లో జరిగిన ఒక కార్యక్రమంలో సివి రామన్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు మహేంద్రవాడ వెంకటేశ్వర అధ్యక్షత వహించి ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరు చెడు మార్గాలకు పయనించకుండా మంచి మార్గాల్లో నడుస్తారని అందువల్ల ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ, సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనేవారు ఎప్పటికీ చెడు మార్గాల్లో ఉండరని అన్నారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు సుమారు 200 మందికి పైగా దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కోట రాజేశ్వరి, భానుమతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, రాజ్యశ్రీ, పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, నాయకులు పోతుల రాజేందర్, చెర్ల సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి నర్సింహులు, తాటి కిరణ్, వనం ఆంజనేయులు, మాదాసు అనంత రాములు, సత్యనారాయణ, శ్రీకాంత్, లక్ష్మీ, అరుణ, సులోచన, మనమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటింటికి వెళ్లి సార్ ప్రక్రియను పూర్తిచేయని బీఎల్ఓలను విధుల నుండి తొలగించాలి:

**హరీష్ గౌడ్ నల్లగొప్పుల డిమాండ్**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఓటర్ల సార్ ప్రక్రియను ఇంటింటికి తిరిగి పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న బూత్ స్థాయి అధికారులను వెంటనే విధుల నుండి తొలగించాలని బండ్లగూడ జాగిర్ నాయకులు హరీష్ గౌడ్ నల్లగొప్పుల డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బండ్లగూడ పరిధిలో సాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, బండ్లగూడలో బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీఎల్ఓలను ఇంటింటికి తిరిగి సార ప్రక్రియ పూర్తి చేయమంటే, ఏదో ఫంక్షన్కు వచ్చినట్టు చెట్ల కింద, రోడ్ల పక్కన, కమ్యూనిటీ హాళ్లలో టెంట్లు వేసుకుని కూర్చొని కాలక్షేపం చేసి వెళ్ళిపోతున్నారు. ప్రభుత్వం ఎక్కడా హెల్ప్ డెస్క్లు ఏర్పాటు చేయమని గానీ, ప్రత్యేక స్టాల్స్ పెట్టమని గానీ చెప్పలేదు అని హరీష్ గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో బీఎల్ఓలు బాధ్యతాయుతంగా ఇంటింటికి తిరిగి ఫారాలు అందిస్తున్నారని, కానీ బండ్లగూడలో మాత్రం రోడ్ల పక్కన స్టాల్స్ పెట్టి, ఫోటోలకు ఫోజులిచ్చి వెళ్తున్నారని ఆయన ఆరోపించారు. ఇదే విధంగా సాగితే ఓటర్లలో 30 శాతం మందికి కూడా ఫారాలు అందే అవకాశం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఫారాలు చేరకపోయినా, డిజిటల్ గణాంకాలలో మాత్రం అందరికీ అందించినట్లు బీఎల్ఓలు తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ విధానాలకు, నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తూ, ఓటర్ల నమోదు ప్రక్రియను ప్రహసనంగా మార్చిన అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీఎల్ఓలను వెంటనే విధుల నుండి తొలగించి, ప్రభుత్వం ఆదేశించినట్లు ఇంటింటికి వెళ్లి ఫారాలు పంపిణీ చేసేలా పారదర్శక చర్యలు చేపట్టాలని హరీష్ గౌడ్ నల్లగొప్పుల డిమాండ్ చేశారు.

## గంధంగూడ లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ పరిధిలోని జిన్నారం ఫేజ్-1 గంధంగూడకు చెందిన లబ్ధిదారులు నాగేష్ సంగీత దంపతులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాన్ని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా సమాజంలో వెనుకబడిన వికలాంగులకు, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించడం జరుగుతోందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందుతాయని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి , జిన్నారం క్వార్టర్స్ వాసులు వెంకటేశ్వర్లు , బలరాం, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ నల్లపోచమ్మ దేవాలయ మహాకుంభాభిషేకం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని హైదర్ గూడ (ఎర్రబోడ) లో వెలసిన శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవాలయ పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిలాబాద్ కు చెందిన శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం 10వ మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి స్వామిజీ వారి కరకమలములచే అమ్మవారి యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, శాంతి పౌష్టికమంత్ర హవనములు తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం జరిగిన ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే తో పాటు సామా ఇంద్రపాల్ రెడ్డి, కోలాన్ సుభాష్ రెడ్డి, మల్లారెడ్డి, పలుగు చెరువు మహేష్, శ్రవణ్ కుమార్, స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో భక్తజనం పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులయ్యారు.

## ఘనంగా పాలాభిషేకం



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల కష్టాలను అర్థం చేసుకొని ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏడు ఎకరాల వరకు సాగు చేసుకుని ఖర్చులకు గాను రైతుబంధు వేయడం జరిగింది. ఈ శుభ సందర్భంగా వెలిమినేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , సినీ ఫోటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంక రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు , పార్లమెంట్ సభ్యులు చామల కుమార్ కిరణ్ కుమార్ రెడ్డి , నకరికల్లు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఈరోజు ఘనంగా పాలాభిషేకం చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య , వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నర్ర వినోద మోహన్ రెడ్డి , మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనరసింహ , సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం , గ్రామ శాఖ అధ్యక్షులు సుర్కంటి సత్తిరెడ్డి , గ్రామ ఉపసర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య గౌడ్ , వెలిమినేడు మాజీ సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ పాపయ్య వెలిమినేడు పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుకుమార్ రెడ్డి , వైస్ చైర్మన్ బొంతల అంజి రెడ్డి ,పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ చీమల వీరేశం , ఎండోమెంట్ మాజీ చైర్మన్ కొంపల్లి వెంకట్ రెడ్డి , గోల్డ్ గణేష్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతటి పారిజాతా నరసింహ గౌడ్ , వార్డ్ మెంబర్స్ జనగాం మంగమ్మ సత్యనారాయణ , మహాకాళి లింగస్వామి చింతకింది వెంకటేశం , వరికుప్పల సంగీత సుధాకర్ , చిర్రగోని శ్రీశైలం , సహాయక సెక్రటరీ తాటికొండ సత్యనారాయణ , మాజీ ఉపసర్పంచ్ ఏనుగు మాధవి సుధాకర్ రెడ్డి , నాయకులు అంశాల సత్యనారాయణ , అంశల శ్రవణ్ , చింతకాయల శివకృష్ణ , నాతి స్వామి , యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ మొదలగు వారు పాల్గొనడం జరిగింది



## సర్ ఫారాల నమోదు కోసం ఇంటింటికీ..ప్రజా సేవే లక్ష్యం..

**సంస్థాన్ నారాయణపూరశీ, జూలై 09(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూరశీ మండలం, వావిళ్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ , మండల మీడియా కన్వీనర్ శ్రీరాముల రవి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సర్ ఫామ్స్ స్వయంగా నింపి సర్వేపై అవగాహన కల్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమం గురించి ఓటర్లకు వివరించారు. అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా సర్ ఫారాలను నింపాలని సూచించారు. నింపిన ఫారాలను సంబంధిత బిఎల్ఓ లకు వెంటనే అందజేయాలని కోరారు. గడువు ముగిసేలోపు ఫారాలను సమర్పించి ఓటరు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు అవసరమైన సమాచారం అందించారు. ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని శ్రీరాముల రవి పేర్కొన్నారు.

## రాజేంద్రనగర్ పరిధిలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ కేంద్రాల తనిఖీ

**- జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి**




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సహాయ కేంద్రాలను అధికారులు గురువారం విస్తృతంగా తనిఖీ చేశారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ తనిఖీలు నిర్వహించారు. హ్యాపీ హోమ్స్ పరిధిలోని గోల్డెన్ హైట్స్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కేంద్రాన్ని జోనల్ కమిషనర్ పరిశీలించారు. ఫారాల పంపిణీ ప్రక్రియ ఎంతవరకు వచ్చింది, స్థానిక నివాసితులకు ఇవి సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రేమవతీపేట్ పరిధిలోని కెన్వర్త్ అపార్ట్‌మెంట్స్ వద్ద ఓటర్ల సహాయార్థం ఏర్పాటు చేసిన ఫారాల సేకరణ మరియు సహాయ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. హెల్ప్ డెస్క్ వద్ద ప్రజలకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సురేందర్ రెడ్డితో పాటు ఇతర మున్సిపల్, ఎన్నికల విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## మణికొండ జన చైతన్య కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఎమ్మెల్యేకు లేఖ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ పరిధిలోని జన చైతన్య హౌసింగ్ కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా ఆస్తుల పరిరక్షణపై స్థానిక నివాసి సీతారాం ధూళిపాళ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే కి ఒక బహిరంగ వినతిపత్రం ద్వారా పలు కీలక వాస్తవాలను దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల కొందరు స్థానిక నాయకులు కాలనీ అభివృద్ధిపై ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో, ఈ సమగ్ర నివేదన ప్రాధాన్యత సంతరించుకుంది. కాలనీల సమగ్ర, పారదర్శక అభివృద్ధిని కాంక్షిస్తూ ఆయన ఎమ్మెల్యే కి ప్రధాన అంశాలను సమర్పించారు. ర్సింగి సర్కిల్--45 నుండి సెరిలింగంపల్లి సర్కిల్ కంటే ఎక్కువ ఆదాయం మున్సిపాలిటీకి సమకూరుతున్నప్పటికీ, ఆ స్థాయికి తగ్గట్టుగా అభివృద్ధి నిధుల కేటాయింపు జరగడం లేదని లేఖలో పేర్కొన్నారు. కేవలం ఒకే కాలనీ కాకుండా మణికొండలోని అనేక కాలనీలు రహదారులు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ , పార్కులు, ఫుట్‌పాత్‌లు, మరియు వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నాయని, కాబట్టి నిధుల కేటాయింపులో అందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జన చైతన్య హౌసింగ్ కాలనీ లేఅవుట్‌ను 03-12-2001 నాడు అప్పటి గ్రామపంచాయతీ మూడు పార్కులతో ఆమోదించిందని, అయితే ప్రస్తుతం ఆ పార్కు స్థలాలు ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు, పార్కులు వంటి ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం హైడ్రా ను ఏర్పాటు చేసినందున.. తక్షణమే ఈ మూడు పార్కుల స్థితిపై విచారణ జరిపి, చట్టప్రకారం పరిరక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కొత్త రహదారులు నిర్మించడానికి ముందే భూగర్భ మురుగునీటి వ్యవస్థ పనులను పూర్తి చేయాలని సూచించారు. దీనివల్ల భవిష్యత్తులో పైప్‌లైన్ల కోసం రోడ్లను మళ్లీ తవ్వాల్సిన అవసరం ఉండదని, తద్వారా భారీగా ప్రజాధనం వృథా కాకుండా ఆదా అవుతుందని స్పష్టం చేశారు. జన చైతన్య హౌసింగ్ కాలనీ, దాని సమీప ప్రాంతాలకు సంబంధించిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు ప్రస్తుతం వట్టినాగులపల్లి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో నిలిపివేయబడ్డాయని, దీనివల్ల వందలాది మంది ఆస్తి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ సాంకేతిక లేదా చట్టపరమైన సమస్యను కూడా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ అంశాలను ఎవరికీ వ్యతిరేకంగా కాకుండా, కేవలం క్షేత్రస్థాయి వాస్తవాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చేందుకు మాత్రమే సమర్పిస్తున్నాము. చట్టబద్ధంగా, సమగ్రంగా, మరియు పారదర్శకంగా ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా అధికారులు, ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాము.



# 75 ఏండ్లుగా జర్నలిస్టుల హక్కుల కోసం టీయూడబ్ల్యూజే పోరాటం




**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 09:** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంగారెడ్డి జిల్లా మహాసభలు గురువారం టీఎన్జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, మెదక్ ఎంపి రఘునందన్ రావులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ.. టీయూడబ్ల్యూజే గత 75 ఏండ్లుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తోందని తెలిపారు. దేశంలోనే 18 వేల సభ్యత్వం కలిగిన సంస్థ టీయూడబ్ల్యూజే అని పేర్కొన్నారు. తాను 35 ఏండ్ల క్రితం మెదక్‌లో జర్నలిస్టుగా ఓనమాలు నేర్చుకున్నానని అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో నాలుగు పర్యాయాలు టీయూడబ్ల్యూజేకు పని చేశానని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మెతుకుసీమ తల్లికి పాదాభివందనం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా విలేకరులు చాలా ప్రత్యేకమని అన్నారు. టీయూడబ్ల్యూజే ఎన్నో సామాజిక అంశాలపై పోరాటాలు చేసిందని పునరుద్ఘాటించారు. నైతిక విలువలు, బాల కార్మిక వ్యవస్థ, ఇసుక మాఫియా, సామాజిక రుగ్మతలు వంటి అనేక అంశాలపై పోరాడిందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో అనేక మంది జర్నలిస్టులు టీయూడబ్ల్యూజే వల్ల లబ్ధి పొందారని అన్నారు. ఇండ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, బస్ పాసులు, హెల్త్ కార్డులు వంటి మౌలిక సదుపాయాల కోసం జర్నలిస్టులకు అండగా నిలిచిందని తెలిపారు. అయితే హెల్త్ కార్డులు గత ప్రభుత్వం హయాంలో కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే అమల్లో ఉన్నాయని చెప్పారు. అనంతరం హెల్త్ కార్డులు లేకపోవడంతో 2014 నుంచి ఇప్పటి వరకు 740 మంది జర్నలిస్టులు అకాల మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనై పని చేస్తారని అన్నారు. వారికి యజమానులు సమయానికి సరిపడా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. చాలామంది వర్కింగ్ జర్నలిస్టులకు స్థిరమైన వేతనాలు కూడా ఉండవని, సమాజం కోసం ఎన్నో ఒత్తిడులు భరిస్తూ స్వచ్ఛందంగా పని చేస్తున్నారని కొనియాడారు. ఇటీవల కాలంలోనే 72 మంది జర్నలిస్టులు అకాల మరణం చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి జర్నలిస్టులకు కనీసం హెల్త్ కార్డులు ఇవ్వాలని వేదికపై ఉన్న ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను విరహత్ అలీ కోరారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. జర్నలిస్టుల బాధలు తనకు తెలుసని, వారందరినీ ఆదుకుంటామని చెప్పారు. అందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హెల్త్ కార్డులు కూడా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పత్రికలతో తనకు, తన తండ్రికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అంతకుముందు మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. తాను ఒకప్పుడు విలేకరినేనని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ పని చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే రైళ్లలో జర్నలిస్టులకు పాస్ సౌకర్యం కల్పించేలా ప్రయత్నిస్తానని తెలిపారు. వందలాది మంది జర్నలిస్టులు సభకు హాజరుకావడంతో మహాసభ విజయవంతంగా ముగిసినట్లు టీయూడబ్ల్యూజే నాయకులు ప్రకటించారు. అనంతరం సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైజల్, రాష్ట్ర నాయకుడు అన్వర్ హుస్సేన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం, జిల్లా నాయకులు అబ్దుల్ బాసిత్, రుమాండ్ల అనిల్ కుమార్‌తో పాటు వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి జిల్లా కమిటీ ఎన్నిక:**

ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బండారు యాదగిరి ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రుమాండ్ల అనిల్, ఉపాధ్యక్షులుగా శ్రీనాథ్ మతీన్, ఆర్. సత్యనారాయణ రెడ్డి, కిషోర్, మల్లేశం, కోశాధికారిగా అన్వర్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీలుగా ఉల్లిగడ్డల శివకుమార్, శ్రీనివాసరెడ్డి, డి.సుమన్, వెంకటేష్, ఎంఏ రవూఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా విలాస్ విల్సన్, అంజయ్య, ఉల్వాల రాజు, రఫీఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా సంగమేశ్వర్, హాసిల్, శివన్న జైన్, సత్తార్ ఖాన్, హబీబ్ ఉద్దీన్, ఆర్. విజయ రాజు, బాలయ్య, శ్రీనివాస్, సత్యం, ఇర్షాన్, ప్రభాకర్ వెంకటేశం, మాజిద్ అలీ, మహబూబ్ ఘోరీ, ముజాహిద్, అబ్దుల్ హై లను ఎన్నుకున్నారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షునిగా ఆసిఫ్, ఉపాధ్యక్షునిగా హెచ్‌ఎంటీవీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బసవేశ్వర్, కోశాధికారిగా శ్రీధర్ జైన్, జాయింట్ సెక్రటరీగా భూపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడిగా సిద్ధిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా జవాన్ ఈశ్వర్, కోశాధికారిగా లక్ష్మణ్ , ఉపాధ్యక్షుడిగా నజీర్ ఎన్నికయ్యారు.

# డివిజన్లలో తీవ్రమైన డ్రైనేజ్ సమస్యలు తక్షణ చర్యలు చేపట్టాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ డిమాండ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జీహెచ్ఎంసీ పరిధిలోని 121, 122, 123 డివిజన్లలో డ్రైనేజ్ సమస్యలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయని, దీనిపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ వినయ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ బాబు డిమాండ్ చేశారు. డ్రైనేజీలు పొంగిపొర్లడం, విపరీతమైన దుర్వాసన, దోమల బెడద, అంటువ్యాధుల ముప్పు కారణంగా ఈ ప్రాంతాల పరిధిలోని సుమారు 250 కాలనీల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యలపై అధికారులకు పదేపదే ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ, కనీసం 10 నుండి 20 రోజుల వరకు సమస్యలు పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయని నేతలు మండిపడ్డారు. ప్రస్తుతం ఈ మూడు డివిజన్లకు కలిపి కేవలం ఒకే ఒక్క డ్రైనేజ్ క్లీనింగ్ మిషన్ అందుబాటులో ఉందని, ఒక్క మిషన్‌తో ఇన్ని వందల కాలనీల అవసరాలను తీర్చడం ఏమాత్రం సాధ్యం కావడం లేదని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గత వారం ఆల్ కాలనీస్ ఫెడరేషన్ బృందం సంబంధిత డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ని కలిసి సమస్య తీవ్రతను వివరించింది. ప్రతి వార్డుకు ఒక డ్రైనేజ్ క్లీనింగ్ వాహనాన్ని కేటాయించాలని కోరగా.. అందుకు సానుకూలంగా స్పందించి అదనపు వాహనాల కోసం టెండర్ ప్రక్రియను ప్రారంభించిన డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫెడరేషన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపింది. కొత్త వాహనాల టెండర్ ప్రక్రియ పూర్తయి అవి అందుబాటులోకి రావడానికి సమయం పడుతుంది కాబట్టి, అంతవరకు ప్రజలు ఇబ్బంది పడకుండా తాత్కాలికంగా అదనపు క్లీనింగ్ మిషన్లను, సిబ్బందిని వెంటనే కేటాయించాలి. జీహెచ్ఎంసీ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పూర్తిగా పరిష్కారమైన తర్వాతనే క్లోజ్ చేసే విధానాన్ని కఠినంగా అమలు చేయాలి. పాత పద్ధతిలో కార్యాలయానికి వచ్చి రిజిస్టర్‌లో రాసే విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి. ప్రతి వార్డుకు ఒక ప్రత్యేక క్లీనింగ్ వాహనాన్ని కేటాయించే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి. ఒకవైపు మూసీ సుందరీకరణ వంటి ప్రతిష్టాత్మక భారీ ప్రాజెక్టుల గురించి ప్రభుత్వం మాట్లాడుతోంది. కానీ మరోవైపు ప్రజల ప్రాథమిక అవసరమైన పారిశుధ్యం, డ్రైనేజ్ వ్యవస్థను సక్రమంగా నిర్వహించలేకపోవడం దురదృష్టకరం. పరిశుభ్రమైన పరిసరాలు పొందడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు ఆల్ కాలనీస్ ఫెడరేషన్ రాబోయే 7 నుండి 10 రోజుల్లో క్షేత్రస్థాయిలో డ్రైనేజ్ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు కనిపించకపోతే, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలను సమీకరించి శాంతియుత పద్ధతిలో భారీ ధర్నా నిర్వహిస్తామని నిరసన నోటీసు జారీ చేశారు. దీనివల్ల తలెత్తే పరిణామాలకు సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

# శోభన కాలనీ ఆటో స్టాండ్ వద్ద కూలిన చెట్టును తొలగించిన డిఆర్ఎఫ్ టీం

**బాలానగర్, జూలై 09 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ శోభన కాలనీలోని ఆటో స్టాండ్ వద్ద పెద్ద చెట్టు కుంగిపోయి రోడ్డుపై అడ్డంగా పడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ విషయాన్ని స్థానిక ఆటో యూనియన్ నాయకులు ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే డిఆర్ఎఫ్ టీంకు ఫిర్యాదు చేసి స్పందించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ చొరవతో డిఆర్ఎఫ్ టీం వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని చెట్టు కొమ్మలను తొలగించడంతో ట్రాఫిక్ యథావిధిగా పునరుద్ధరించబడింది. ఈ సహాయానికి గాను స్థానిక ఆటో స్టాండ్ నాయకులు, స్థానికులు మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సలావుద్దీన్, రాజు, నరేష్ పాల్గొన్నారు.






# కుమ్మర్ల తొలి బోనం జాతర విజయవంతం చేయాలి

**కుమ్మర సంఘం మండల అధ్యక్షులు సిలివేరు సైదులు**

**సంస్థాన్ నారాయణపురం, జూలై 09(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం నారాయణపురం మండల అధ్యక్షులు సిలివేరు సైదులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో జరిగే కుమ్మర్ల తొలి బోనశీ జాతరను విజయవంతం చేయాలని మండల కుమ్మరి కుల బంధువులందరికీ పిలుపునివ్వడం జరిగినది జరిగినది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నారాయణపురం మండల అధ్యక్షులు సిలివేరు సైదులు మాట్లాడుతూ ఈనెల 16 తేదీన శ్రీశ్రీశ్రీ కనకాల కట్ట మైసమ్మ గుడి లోయర్ ట్యాంక్ బండ్ హైదరాబాదులో జరిగే కుమ్మర్ల తొలి బోనం జాతరను ఆడపడుచులంతా పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక కుమ్మరి సంఘం కార్యాలయంలో కరపత్రాలను కుమ్మరి కుల సభ్యులతో విడుదల చేయడం జరిగినది. గ్రామదేవతలకు తొలి పూజారిగా ఆనాటి కాలంలోనే కుమ్మర్లను గుర్తించారని తుమ్మల తొలి బోనంగా మట్టికుండలో పెట్టే ఆచార ఆనాటి నుండి ఈనాటి వరకు సంప్రదాయంగా కొనసాగుతుందని దీనిని ప్రభుత్వం అధికారిక కార్యక్రమంలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం నారాయణపురం మండల అధ్యక్షులు సిలువేరు సైదులు జిల్లా కార్యదర్శి చిలువేరు శంకర్ గౌరవ అధ్యక్షులు చిలువేరు లారీ బిక్షం బొడ్డుపల్లి గాలయ్య తెలంగాణ బిక్షం చిలువేరు బిక్షం వెంకులు, ముత్యాలు శంకర్ వెంకటేష్ నరసింహ జంగయ్య రాములు శ్రీను యాదయ్యచిలువేరు అంజయ్య సంజీవ నారాయణ నరసింహ మురళి రమేష్ తేజ భిక్షమయ్య కృష్ణయ్య కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీశ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక బ్రహ్మోత్సవం

**కూకట్ పల్లి, జూలై 09 (క్రైమ్ మిర్రర్) :** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి అనుగ్రహం ప్రజలందరిపైన ఉండాలని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఆకాంక్షించారు. నియోజకవర్గ పరిధిలోని గాయత్రినగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో కొలువైన శ్రీశ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్, ఆలయ పాలకవర్గ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక నాయకులతో కలిసి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు బండి రమేష్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, వేముల సత్యం, మస్తాన్ రెడ్డి, శ్రీనివాస యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శంషాబాద్ బిఆర్ఎస్ పార్టీలో చేరికల జోరు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ పట్టణంలో భారత్ రాష్ట్ర సమితి పార్టీలోకి వలసల జోరు ఊపందుకుంది. పార్టీ బలోపేతమే లక్ష్యంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ పట్టణ పరిధిలోని రుద్రాకాలనీకి చెందిన సుమారు 35 మంది యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. శంషాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక సమావేశంలో యువకులందరికీ ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శంషాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని కొనియాడారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఇంకా ఎంతో మంది కీలక నాయకులు, యువకులు పార్టీలో చేరబోతున్నారని ఆయన స్పష్టం చేశారు. యువత భాగస్వామ్యంతో శంషాబాద్ డివిజన్‌లో పార్టీని మరింత పటిష్టం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రాహుల్ అప్పాతో పాటు పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు రుద్రాకాలనీ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధనకు బంద్ విజయవంతం చేయాలి

**కూకట్ పల్లి, జూలై 09 (క్రైమ్ మిర్రర్) :** రాష్ట్రంలో విద్యారంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో విద్యార్థుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు రేపు చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు జిల్లా సహాయ కార్యదర్శి చైతన్య విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, విద్యను రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుగా కాకుండా లాభాల కోసం నడిచే వ్యాపారంగా మార్చడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో వేలాది అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని అన్నారు. విద్యార్థుల హాస్టళ్లలో నాసిరకం భోజనం, తాగునీటి కొరత, పారిశుధ్య సమస్యలు, భద్రతా లోపాలు, సరిపడా వసతి లేకపోవడం వంటి సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు చదువులు కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన అన్నారు. పేద కుటుంబాలకు ఉన్నత విద్య భారంగా మారిందని, విద్యార్థులు అప్పుల పాలవుతున్న పరిస్థితి ఆందోళనకరమని పేర్కొన్నారు. నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యను బలహీనపరచే చర్యలను విరమించి, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, ఖాళీ అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య, హాస్టల్ సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన ఈ బంద్ ప్రజా ప్రయోజనాల కోసమేనని, అందువల్ల విద్యార్థులు, యువజనులు, తల్లిదండ్రులు,




ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు బంద్‌ను విజయవంతం చేసి తమ సంఘీభావాన్ని తెలియజేయాలని జిల్లా సహాయ కార్యదర్శి చైతన్య పిలుపునిచ్చారు. విద్య అనేది కొందరికి అమ్ముకునే వస్తువు కాదు... ప్రతి విద్యార్థికి అందాల్సిన రాజ్యాంగ హక్కు. ఆ హక్కు పరిరక్షణ కోసమే ఈ ఉద్యమమని ఆయన పేర్కొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం..



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాలకు చెందిన రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న పోడు భూములు, వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. రైతుల సమస్యలను కార్యాలయాల్లో కాకుండా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం సోమశిలలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌తో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చిస్తూ సమస్యల పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలుసుకున్నారు. రైతుల సమక్షంలోనే ఒక్కో సమస్యను పరిశీలిస్తూ అక్కడికక్కడే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమీక్ష సమావేశానికి జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో రైతులకు తమ భూ సమస్యలను నేరుగా వివరించే అవకాశం కల్పించడం సమావేశానికి ప్రత్యేకతగా నిలిచింది. ఒక్కో గ్రామానికి చెందిన రైతులను విడివిడిగా పిలిపించి వారి సమస్యలను మంత్రి స్వయంగా ఆలకించారు. ప్రతి కేసు ప్రస్తుతం ఏ దశలో ఉందో, రెవెన్యూ శాఖ వద్ద పెండింగ్‌లో ఉందా, అటవీ శాఖ పరిధిలో ఉందా, సర్వే పూర్తికాక నిలిచిపోయిందా, లేక రికార్డుల్లో వ్యత్యాసాల కారణంగా నిలిచిందా అనే అంశాలను అధికారులను ప్రశ్నిస్తూ సమగ్రంగా సమీక్షించారు. కొన్ని గ్రామాల్లో అటవీ శాఖ అభ్యంతరాల కారణంగా, మరికొన్ని చోట్ల రెవెన్యూ రికార్డుల్లోని లోపాల వల్ల, ఇంకొన్ని ప్రాంతాల్లో సర్వే నంబర్ల వివాదాల కారణంగా రైతులు దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు హక్కులు పొందలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులను అక్కడికక్కడే వివరణ కోరుతూ సమస్యల మూలాలను గుర్తించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ....., రైతుల భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భూమి రైతుకు జీవనాధారం అని, అలాంటి భూములకు సంబంధించిన వివాదాలు ఏళ్ల తరబడి కొనసాగడం వల్ల రైతులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందుకే రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు నేరుగా గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పరిష్కరించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏళ్ల తరబడి భూ సమస్యలు పెండింగ్‌లో ఉండటం ఏమిటి? రైతులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోంది? అంటూ మంత్రి అధికారులను ప్రశ్నించారు. రైతులు దరఖాస్తు చేసిన తర్వాత నెలలు, సంవత్సరాల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదని, ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని మంత్రి హెచ్చరించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల అనేక భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి తెలిపారు . ఇకపై రెండు శాఖలు పరస్పర సహకారంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వివాదాస్పద భూములపై సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి, భూ రికార్డులు, అటవీ సరిహద్దులు, రైతుల ఆధీనంలో ఉన్న భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. ఏ శాఖ పరిధిలో ఏ సమస్య ఉందో వెంటనే గుర్తించి పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలని, ఫైళ్లను ఒక శాఖ నుంచి మరో శాఖకు పంపుతూ కాలయాపన చేయకుండా సమన్వయంతో నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోడు భూములు, పట్టాదారు పాస్‌బుక్ సమస్యలు, సర్వే నంబర్ల వివాదాలు, రికార్డుల్లోని తప్పులు, సరిహద్దు వివాదాలు, సాగులో ఉన్న భూములపై నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించిన మంత్రి, అర్హులైన రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చట్టబద్ధంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే రైతుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని, అధికారులు ప్రజల సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా బాధ్యత, జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును మానవీయ కోణంలో పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో రైతులు లేవనెత్తిన ప్రతి సమస్యపై సంబంధిత అధికారులను ప్రశ్నించిన మంత్రి, అవసరమైన చోట అటవీ, రెవెన్యూ శాఖల సంయుక్త బృందాలతో క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టి త్వరితగతిన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. నివేదికల ఆధారంగా చట్టబద్ధంగా సమస్యలను పరిష్కరించి అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో, పారదర్శకంగా పనిచేయాలని, రైతులను ఇకపై కార్యాలయాల చుట్టూ తిప్పే పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., రైతుల భూ సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్‌లు, పాత పట్టాలు, సర్వే నంబర్లు, హద్దులు, సరిహద్దుల వివరాలు, అందుబాటులో ఉన్న ఇతర రికార్డులను సంబంధిత ఆర్డీవో కార్యాలయానికి అందించాలని సూచించారు. పూర్తి స్థాయి రికార్డులు అందుబాటులో ఉంటే సమస్యల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి, భూమి వాస్తవ పరిస్థితి, భూ రికార్డులు, అటవీ సరిహద్దులు, రైతుల సాగు ఆధారాలను సమగ్రంగా పరిశీలిస్తారని చెప్పారు. సర్వేలో అర్హత ఉన్నట్లు నిర్ధారణ అయిన రైతుల భూములను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భూ భారతి పోర్టల్‌లో నమోదు చేసి, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించే చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వెల్లడించారు.



## రాజశేఖరా.. ఎక్కడున్నావ్? గ్రామం కంపు కొడుతోంది...!

**శింగనమల, జూలై 09(క్రైమ్ మిర్రర్ ):** రాజశేఖరా.. ఎక్కడున్నావ్? గ్రామం కంపు కొడుతోంది లోలూరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెప్పినా వినేవారు లేరు.. చూసినా స్పందించేవారు లేరు అన్నట్లుగా, పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చిందని వారు వాపోతున్నారు.గ్రామంలోని జమీమను కట్ట నుంచి రఘునాథపురం వెళ్లే ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. డ్రైనేజీ కాలువలు పూడిపోవడం, చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రహదారిపై ప్రతిరోజూ విద్యార్థులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.మురుగునీటి నిల్వలతో దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఇప్పటికైనా జిల్లా, మండల అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలను తక్షణమే శుభ్రం చేయించి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## దశాబ్దాల ప్రజాసేవను ప్రజలు మరువరు: ఓడేటి లక్ష్మారెడ్డి

- మంత్రి శ్రీధర్ బాబుపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి
- శ్రీధర్ బాబును విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలి
- ప్రజాసేవకుడిపై దుష్ప్రచారం సరికాదు: ఓడేటి లక్ష్మారెడ్డి



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారిపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గారు తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని మహాదేవపూర్ మండలం సూరారం గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఓడేటి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ, దశాబ్దాలుగా నియోజకవర్గ అభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకుని పనిచేస్తున్న నాయకుడిపై నిరాధార వ్యాఖ్యలు చేయడం ప్రజలు అంగీకరించరని ఆయన అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు రాజకీయ జీవితమంతా ప్రజాసేవకే అంకితమైందని లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, తాగునీటి సదుపాయాలు, రహదారుల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, యువతకు ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అనేక రంగాల్లో ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా శ్రీధర్ బాబు గుర్తింపు పొందారని ఆయన అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు స్వాగతిస్తున్నారని, అలాంటి సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలు చేయడం బాధ్యతాయుతమైన రాజకీయాలకు విరుద్ధమని లక్ష్మారెడ్డి వ్యాఖ్యానించారు. విమర్శలు చేయాలంటే వాస్తవాల ఆధారంగా చేయాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఎవరికీ మేలు చేయవని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం పొందిన నాయకుడిపై ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మరని, చివరికి అభివృద్ధే మాట్లాడుతుందని అన్నారు. రాజకీయాల్లో పరస్పర విమర్శలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత విమర్శలు, నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గారికి లక్ష్మారెడ్డి సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేస్తున్న కృషికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, అలాంటి నాయకుడిపై జరుగుతున్న దుష్ప్రచారాలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ విశ్వసించరని ఓడేటి లక్ష్మారెడ్డి అన్నారు.

## దేవరకొండ చేనేత సహకార సంఘం చైర్మన్ గా చెరిపల్లి బాలరాజు ఏకగ్రీవ ఎన్నిక...

**దేవరకొండ టౌన్ జులై 09 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** దేవరకొండ చేనేత సహకార సంఘం అధ్యక్షులుగా చెరిపల్లి బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా పున్న గోవర్ధన్, కోశాధికారిగా వనం శీను, ఉపాధ్యక్షులుగా చిలువేరు స్వామి నందీశ్వర్, గురువారం ఎన్నికయ్యారు. వీరిని ఎన్నికల అధికారి నామ భాస్కర్ సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చెరిపల్లి బాలరాజు తన ప్యానల్ కార్యవర్గంతో కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులతో కలిసి సహకార సంఘం భవనం ముందు కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చేనేత సహకార సంఘం అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానని చేనేత కార్మికులకు ప్రభుత్వం నుండి అందేటువంటి అనేక సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గుర్రం విజయలక్ష్మి పగిడిమర్రి రఘురాములు, సిరిపోతు శ్రీరాములు, ముసిని అంజిబాబు,పులిజాల జానీ, గాజుల వినయ్, మాకం మహేష్, పున్న భవనా ఋషి లీలావతి, రాపోలు భారతమ్మ, పున్న బిక్షమయ్య, వనం యాదయ్య, చెరిపల్లి యల్లయ్య జయలక్ష్మి, ముసిని రమేష్ ముసిని రమేష్, అప్పం ప్రకాష్, చిలివేరు శ్రీను, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన శ్రేణులు సమాయత్తం కావాలి: నేమూరి శంకర్ గౌడ్



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** తెలంగాణలో జరగనున్న జడ్‌పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్ స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ మణికొండలోని జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సూచనల మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కోఆర్డినేటర్లు, సాధక్‌లు తమ తమ ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులకు ఈసారి కూడా ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా క్షేత్రస్థాయి సమావేశాలు నిర్వహించి, సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను బరిలోకి దించేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాధారాం రాజలింగం, ఎం. దామోదర్ రెడ్డి, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, మచ్చా సుధాకర్, గడల శ్రీనివాస్, కావ్య, తనూజా, ప్రజీత్ గౌడ్, మిర్యాల రామకృష్ణ, ప్రేమ్ గాంధీ, కమ్మరి శ్రీను, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.




## బాబుల్ రెడ్డి నగర్ శ్రీ పోచమ్మ దేవాలయానికి బోనాల ఉత్సవాల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌కు వినతి

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** వచ్చేనెల నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాత్మక ఆధ్యాత్మిక వేడుక బోనాల మహోత్సవాల సందర్భంగా ఎండోమెంట్స్ శాఖ రాష్ట్రంలోని వివిధ దేవాలయాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బాబుల్ రెడ్డి నగర్ శ్రీ పోచమ్మ దేవాలయానికి నిధులు కేటాయించాలని స్థానిక ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, బాబుల్ రెడ్డి నగర్ శ్రీ పోచమ్మ దేవాలయం పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఆరాధ్య దైవంగా నిలిచిందని, ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలను వేలాది మంది భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఏడాది కూడా బోనాల ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఆలయ అభివృద్ధి, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం సహకారం అందించాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. ఈ వినతిపై ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి దేవాలయానికి నిధులు మంజూరు అయ్యేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమ శ్రీనివాస్ గుప్తా, దేవాలయ అధ్యక్షుడు శంకర్, సందుల హనుమంత్, ఓం ప్రకాష్, వెంకటయ్య, బాలరాజు, మల్లేష్, విజయలక్ష్మి, శోభ, నవీన్, కృష్ణ, పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు....

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.